ఆంధ్రజ్యోతి

గరిష్ఠం 31.0 | కనిష్ఠం 23.2

ANDHRAJYOTHY

నల్లగొండ

3 | సోమవారం 6 అక్టోబరు 2025

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	587.50 (305.8030)	55,131	55,131
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.80 (4.15)	1,949.30	2,248.36
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	173.226 (43.0610)	97,537	90,774

చికెన్ ధరలు | లైవ్ : రూ.130 | డ్రెస్ : రూ.200 | స్కిన్‌లెస్ : రూ.230





స్థానిక సంస్థల ఎన్నికలకు మూడు రోజుల్లో తొలివిడత నోటిఫికేషన్ విడుదలకు రంగం సిద్ధమవుతున్నా క్షేత్రస్థాయిలో మాత్రం ఉత్కంఠ కొనసాగుతోంది. 42శాతం బీసీ రిజర్వేషన్లను కొట్టివేయాలని కోరుతూ ఇటు హైకోర్టులో 8వ తేదీన విచారణ ఉండగా, తాజాగా సుప్రీంకోర్టులో నమోదైన పిటిషన్ సోమవారం విచారణకు రానుంది. దీంతో కోర్టు తీర్పులపై అంతటా ఉత్కంఠ నెలకొంది.

-(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, నల్లగొండ)

ఉత్కంఠే!

- కోర్టుల విచారణపైనే అందరి దృష్టి
- అభ్యర్థులపై ప్రాథమిక కసరత్తు చేస్తున్న పార్టీలు
- గ్రామాల్లో అంతగా కనిపించని సందడి

స్థానిక సంస్థల ఎన్నికలపై రెండు కోర్టులు ఎలాంటి సూచనలు చేస్తాయనే దానిపైనే అందరి దృష్టి నెలకొంది. అధికార కాంగ్రెస్ సహా అన్ని రాజకీయపార్టీలూ కోర్టు నిర్ణయాల కోసం ఎదురుచూస్తూనే మరోవైపు ఎన్నికలకోసం కార్యాచరణ ప్రారంభించాయి. సోమవారం సుప్రీంకోర్టు ఎలాంటి సూచనలు చేస్తుందో వేచి చూడాల్సి ఉందని, అదేవిధంగా హైకోర్టు బుధవారం ఎలా స్పందిస్తుందనే దానికి అనుగుణంగానే ఎన్నికల నిర్వహణ ఆధారపడి ఉంటుందని అంతా భావిస్తున్నారు. రిజర్వేషన్లపై కోర్టులు ఎలా స్పందించినా, ఎన్నికలు నిర్వహించడం మాత్రం పక్కా అని అధికార వర్గాలు చెబుతున్నాయి. తప్పనిసరి పరిస్థితి ఎదురైతే ప్రభుత్వం ఎన్నికల రిజర్వేషన్లు, షెడ్యూల్‌ను సవరించైనా నిర్వహిస్తుందని చెబుతున్నారు.

అభ్యర్థుల ఎంపికపై మొదలయిన ప్రాథమిక కసరత్తు

సీట్ల వారీగా రిజర్వేషన్లు, ఎన్నికల షెడ్యూల్ విడుదలవడంతో అభ్యర్థుల ఎంపికకు పార్టీలు ప్రాథమిక కసరత్తు ప్రారంభించాయి. అధికార కాంగ్రెస్ పార్టీ ప్రతీ జడ్పీటీసీ స్థానం నుంచి ముగ్గురు పేర్లతో జాబితాను రూపొందిస్తోంది. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, సీనియర్ నేతలు అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా అభ్యర్థులను గుర్తించి అభ్యర్థిత్వం కోసం ఇన్‌చార్జి మంత్రి ద్వారా టీపీసీసీకి సిఫార్సు చేస్తున్నారు. దీంతో అవకాశం కల్పించాలని కోరుతూ టిక్కెట్ ఆశించే నేతలు మంత్రులు, ఎమ్మెల్యేల వద్ద వారి అనుచరులతో కలిసి విజ్ఞాపనలు చేస్తున్నారు. మరోవైపున ఎంపీటీసీ, సర్పంచ్ అభ్యర్థిత్వాలకు సైతం ఎమ్మెల్యేలు సూచించినవారికే ఇవ్వనుండడంతో పేర్లను పరిశీలించాల్సిందిగా ఆశావహులు కోరుతున్నారు. ప్రజల్లో మంచితనం, పార్టీకి విధేయత, గెలుపు అవకాశాలు, ఎన్నికల్లో ఖర్చుపెట్టే సామర్థ్యం ఆధారంగా అభ్యర్థులను ఎంపికచేస్తున్నట్లు కార్యకర్తలు చెబుతున్నారు. ఈనెల 8వ తేదీన జడ్పీటీసీ అభ్యర్థుల జాబితాను పీసీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ అభ్యర్థుల జాబితాలను డీసీసీ ప్రకటిస్తుందని చెబుతున్నారు. పొత్తులు ఖరారైతే ఎక్కడెక్కడ పోటీచేయాలి? ఒంటరిగా పోటీచేయాల్సి వస్తే ఎక్కడ అభ్యర్థులను బరిలో నిలపాలనే ప్రణాళికను సీపీఎం సిద్ధం చేయగా, కాంగ్రెస్, సీపీఎంతో కలిసి ఎన్నికలకు వెళ్లాలని భావిస్తున్న సీపీఐ పోటీచేసే స్థానాలను ఇప్పటికే గుర్తించి సిద్ధం చేసినట్లు తెలిసింది. ప్రతిపక్ష బీఆర్ఎస్ ఇప్పటికే మాజీమంత్రి, మాజీ ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో మండలాల వారీగా కార్యకర్తల సమావేశాలు నిర్వహించి ఎన్నికల్లో పోటీపై మార్గనిర్దేశనం చేశారు. ఎన్నికల్లో అన్ని సీట్లలో పోటీచేసి గెలుపొందాలనే లక్ష్యంతో పార్టీ నేతలు సిద్ధమవుతున్నారు. బీఆర్ఎస్ నుంచి టిక్కెట్ ఆశించే నేతలు ఇప్పటికే మాజీ ఎమ్మెల్యేల వద్ద ప్రయత్నాలు మొదలుపెట్టారు. పార్టీ విస్తరణకు దోహదపడేలా ఈ స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీచేసి సత్తాచాటాలని బీజేపీ చూస్తోంది. గతంలో మాదిరిగా నామమాత్రపు పోటీలకు పరిమితం కావద్దని అధిష్ఠానం గట్టిగా చెబుతుండడంతో స్థానిక నేతలు బలమైన అభ్యర్థుల కోసం అన్వేషణ ప్రారంభించారు. అభ్యర్థుల ఎంపికకోసం త్రీమెన్ కమిటీలను ఏర్పాటు చేయాలని పార్టీ నిర్ణయించింది. ఆశావహులతో పాటు, బలమైన నాయకులను గుర్తించి ఈ కమిటీ అభ్యర్థులను సిఫార్సు చేస్తుందని, ఆ మేరకు అభ్యర్థిత్వాలు ఖరారు చేస్తామని పార్టీ ముఖ్య నేతలు చెబుతున్నారు.

గ్రామాల్లో కనిపించని సందడి

గతానికి భిన్నంగా ప్రస్తుత స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి గ్రామాల్లో ఇంకా సందడి ఆరంభం కాలేదు. ప్రధానంగా కోర్టుల కేసులతో పాటు, రిజర్వేషన్లు తారుమారయ్యే పరిస్థితి ఏర్పడింది. దీంతో గ్రామాల్లో అంతగా సందడి లేదు. అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్‌లో కొన్నేళ్లుగా స్థానిక సంస్థల్లో పోటీచేయాలని భావించి రాజకీయాల్లో కొనసాగుతూ, గ్రామాల్లో సేవాకార్యక్రమాలు, రాజకీయ కార్యక్రమాలు నిర్వహిస్తున్న నాయకులకు రిజర్వేషన్లు ప్రతికూలంగా మారడంతో పరిస్థితి తారుమారైంది. మరోవైపున ద్వితీయ శ్రేణినాయకులుగా చలామణీ అవుతూ మండల, నియోజకవర్గస్థాయిల్లో రాజకీయాల్లో క్రియాశీలకంగా ఉన్న నేతలకు సైతం అనుకూలమైన రిజర్వేషన్ల రాకపోవడంతో వారంతా ఒక్కసారిగా స్తబ్దుగా మారారు. రిజర్వేషన్లతో రాజకీయ ఉనికికి దెబ్బతగిలినట్లయిందని, దశాబ్దాల పాటు రాజకీయాల్లో కొనసాగినా చివరకు కీలకమైన పదవికి పోటీపడుతామనే దశలో రిజర్వేషన్లతో ఆశలు వమ్మయ్యాయని సదరు నేతలు వాపోతున్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయాల్లో ఎమ్మెల్యే అభ్యర్థుల కోసం శ్రమించామని, ఆర్థికంగానూ ఎంతో వ్యయం చేసినా చివరికి ఫలితం దక్కే పరిస్థితి లేకుండా పోయిందని వేదన చెందుతున్నారు.

బీఆర్ఎస్ ముందస్తు సమావేశాలు



సూర్యాపేట(కలెక్టరేట్), అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని బీఆర్ఎస్ ముందస్తు సమావేశాలు నిర్వహించింది. సూర్యాపేట నియోజకవర్గంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీ‌ష్‌రెడ్డి నెల క్రితం ఎంపీటీసీల వారీగా ఇన్‌చార్జీలను ఏర్పాటు చేసి క్షేత్రస్థాయిలో సమావేశాలు నిర్వహించారు. మునిసిపాలిటీ పరిధిలోని ముఖ్య నాయకులకు సూర్యాపేట, పెన్‌పహాడ్, చివ్వెంల, ఆత్మకూర్(ఎస్) మండలాల పరిధిలోని ఎంపీటీసీల స్థానాల వారీగా ఇన్‌చార్జీలుగా నియమించారు. వారి ద్వారా స్థానిక నాయకులను సమన్వయం చేసుకుని వారికి కేటాయించిన పరిధిలో గ్రామాలు, తండాల్లో అంతర్గత సమావేశాలు నిర్వహించారు. దీంతో పాటు ఎంపీటీసీ స్థానం పరిధిలో బీఆర్ఎస్ నుంచి పోటీచేసి విజయం సాధించే అభ్యర్థుల పేర్లను కూడా సేకరించారు. తుంగతుర్తి, కోదాడ నియోజకవర్గాల్లో మాజీ ఎమ్మెల్యేలు గాదరి కిశోర్‌కుమార్, బొల్లం మల్లయ్య యాదవ్ మండల స్థాయి పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశాలు నిర్వహించారు. హుజూర్‌నగర్‌లో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు సమావేశాలు నిర్వహించాల్సి ఉంది. ఇదిలా ఉండగా, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పరిపాలనలో వైఫల్యాలపై బీఆర్ఎస్ స్థానిక ఎన్నికల్లో ప్రచారం చేయనుంది. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీల్లో అమలు కానివాటిపై బీఆర్ఎస్ దృష్టి సారించింది. అంతేగాక ఇటీవల యూరియా కొరతతో రైతులు ఎదుర్కొన్న ఇబ్బందులను ప్రచారాస్త్రంగా మలచాలని బీఆర్ఎస్ చూస్తోంది. అదే విధంగా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను గుర్తించి వాటిని ప్రజలకు అర్థమయ్యేలా వివరించి ఎన్నికల్లో లబ్ధిపొందాలని భావిస్తోంది. దీంతో పాటు తుంగతుర్తి, సూర్యాపేట, కోదాడ నియోజకవర్గాలకు గోదావరి జలాలు రాలేదని, కావాలనే కాళేశ్వరం ద్వారా నీటిని సరఫరా చేయలేదనే అంశాలను బీఆర్ఎస్ ప్రచారంలో ప్రస్తావించనుంది.

ప్రభుత్వ సంక్షేమ పాలనపై అధికార పార్టీ ఆశలు

స్థానిక ఎన్నికల్లో విజయం సాధించేందుకు అధికార కాంగ్రెస్ పార్టీ ఎన్నో ఆశలు పెట్టుకుంది. ప్రధానంగా ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ప్రజలకు అందిస్తున్న ప్రజా సంక్షేమ పాలనపై ఆధార పడింది. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ప్రధాన హామీలు అమలు చేసిన విషయాలను ప్రచారంలో ప్రముఖంగా ప్రస్తావించనుంది. రైతులకు రుణమాఫీ, సన్నరకం ధాన్యానికి అదనంగా బోనస్, ఇందిరమ్మ ఇళ్లు, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, 200 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్, సన్నబియ్యం పంపిణీ, నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు, రైతు భరోసా, భూభారతి, తదితర పథకాలను ప్రధాన ప్రచారాస్త్రాలుగా అధికార కాంగ్రెస్ ఎంచుకోనుంది. గత బీఆర్ఎస్ పాలనలో అవినీతి, అక్రమాలు జరిగాయని అధికార పార్టీ నాయకులు ప్రచారంలో ప్రజలకు వివరించి విశ్వాసాన్ని చూరగొనే ప్రయత్నాలు చేయనున్నారు. అదేవిధంగా బీజేపీ సైతం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, ప్రధాని నరేంద్ర మోదీ పాలనను ప్రజలకు వివరించి పార్టీ అభ్యర్థుల విజయానికి సన్నాహాలు చేస్తోంది.

లతీఫుల్లా షాఖాద్రి ఉర్సుకు వేళాయె

- 9 నుంచి ఉత్సవాలు ప్రారంభం
- ముస్తాబైన దర్గా



నల్లగొండ కల్చరల్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని చారిత్రాత్మక హజ్రత్ సయ్యద్ లతీఫుల్లా షాఖాద్రి దర్గా ఉర్సు ఉత్సవాలు ఈ నెల 9న లాంఛనంగా ప్రారంభంకానున్నాయి. ఉర్సు ఉత్సవాలకు రాష్ట్రంలోని నలుమూలల ప్రాంతాల నుంచేగాక, ఏపీ, కర్నాటక, మహారాష్ట్ర నుంచి కూడా భక్తులు హాజరవుతారు. అధికారికంగా మూడు రోజులే ఈ ఉర్సు ఉత్సవాలు నిర్వహిస్తుండగా, ఆ తరువాత నెల రోజుల పాటు సాగనున్నాయి. ఇప్పటికే గుట్టమెట్ల ప్రాంతంలో వివిధ రకాల దుకాణాలు ఏర్పాటయ్యాయి. దర్గా ప్రాంతమంతా విద్యుత్ దీపాలతో అలంకరించి రంగులు వేసి ముస్తాబు చేశారు. దీంతో ఈ ప్రాంతంలో ఆధ్యాత్మిక, ఆహ్లాదకర వాతావరణం నెలకొంది. ఈనెల 9న సాయంత్రం 5.30 గంటలకు స్థానిక మదీనా మసీదులో గంధానికి ప్రార్థనలు నిర్వహించిన అనంతరం పట్టణంలో ఊరేగింపు నిర్వహిస్తారు. ఇక్కడి నుంచి గంధం ఊరేగింపు రాత్రికి గుట్ట మెట్ల వద్దకు చేరుకున్న అనంతరం ఉర్సు ఉత్సవాలు ప్రారంభం అవుతాయి. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కలెక్టర్ ఇలా ఎస్పీ శరత్‌చంద్రపవార్, వివిధ పార్టీ నాయకులు, ఇతర ప్రజాప్రతినిధులు హాజరై గంధానికి స్వాగతం పలికి ఉర్సు ఉత్సవాలను లాంఛనంగా ప్రారంభిస్తారని దర్గా ముతవల్లులు సయ్యద్ సమిఉల్లా ఖాద్రి, సల్మాన్ ఖాద్రీ తెలిపారు. 10వ తేదీన దర్గాలో దీపారాధన, నిరంతరం భక్తులకు అన్నదానం, పాత కలెక్టరేట్ మసీదులో ఖురాన్ పఠనం, ప్రముఖుల సందేశాలు ఉంటాయి. 11నరాత్రి గుట్టమెట్ల వద్ద కళాకారుల ఖవ్వాలి ఉంటుంది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు జరగకుండా తాగు నీరు, ఇతర వసతులు కల్పించారు. నెల రోజులపాటు కొనసాగే ఈ ఉర్సు ఉత్సవాల్లో ముస్లింలతోపాటు హిందువులు అధిక సంఖ్య పాల్గొని ప్రత్యేక ప్రార్థనలకు హాజరవుతారు. ఇదిలా ఉండగా, దర్గా వద్దకు ఘాట్ రోడ్డు పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. అన్నిశాఖల అధికారుల సమన్వయంతో ఉర్సు ఉత్సవాల ఏర్పాట్లు, భక్తులకు వసతుల కల్పన పనులు కొనసాగుతున్నాయి.

పత్తి కొనుగోళ్ల ప్రారంభమెప్పుడో?

- సీసీఐ నిబంధనలను వ్యతిరేకిస్తున్న జిన్నింగ్ మిల్లుల యజమానులు
- టెండర్ దాఖలుకు ఆసక్తి చూపని మిల్లు యజమానులు
- ప్రైవేట్ వ్యాపారులకు తక్కువ ధరకు విక్రయిస్తున్న రైతులు
- 'కపాస్ కిసాన్' యాప్‌తో అక్రమాలకు చెక్

ఉమ్మడి జిల్లాలో పత్తి దిగుబడుల రాక ప్రారంభమైంది. ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధరకు పత్తి కొనుగోలుకు కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) సిద్ధమైనా, సీసీఐ నిబంధనలను జిన్నింగ్ మిల్లుల యజమానులు వ్యతిరేకిస్తున్నారు. ఈ నేపథ్యంలో సీసీఐ, మార్కెటింగ్‌శాఖ, కలెక్టర్లు సమన్వయంతో పత్తి కొనుగోళ్లకు సన్నాహాలు చేస్తున్నారు.

- (ఆంధ్రజ్యోతి,మోత్కూరు)



కేంద్ర ప్రభుత్వం నూతనంగా 'కపాస్ కిసాన్' యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఈ యాప్‌లో స్లాట్ బుకింగ్ ద్వారా పత్తి విక్రయానికి ఒక్కోప్రాంతం వారికి ఒక్కో మిల్లు కేటాయించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. దేశంలో కొన్నిరాష్ట్రాల్లో ఇప్పటికే పత్తి కొనుగోళ్లకు టెండర్లు పూర్తికాగా, రాష్ట్రంలో మాత్రం కఠిన నిబంధనలతో జిన్నింగ్ మిల్లులు విముఖత చూపుతున్నట్టు సమాచారం. దీనిపై సీసీఐ అధికారులు, జిన్నింగ్ మిల్లుల యజమానులతో ఈ నెల 6న సమావేశం కానున్నారు. ఈ సమావేశంలో విధివిధానాలు ఖరారయ్యే అవకాశం ఉంది.

కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో జాప్యం

రాష్ట్ర వ్యాప్తంగా ఈ ఏడాది అధిక వర్షాలు కురిసి పత్తి చేలు దెబ్బతిన్నాయి. ఇప్పటికీ అడపాదడపా వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. వర్షాల కారణంగా పత్తి నాణ్యత దెబ్బతిన్నది. పత్తిలో తేమ ఎక్కువగా ఉంటోందని, రంగుమారి వస్తోందని, ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరకు కొనుగోలు చేస్తే నష్టపోతామని జిన్నింగ్ మిల్లుల యజమానులు సీసీఐతో ఒప్పందం కుదుర్చుకోవడంలో జాప్యం చేస్తున్నట్టు తెలుస్తోంది. దీనికి తోడు పత్తి కొనుగోలుకు ఎల్-1, ఎల్-2, ఎల్-3 విధానాన్ని ఎత్తి వేయాలని జిన్నింగ్ మిల్లుల యజమానులు డిమాండ్ చేస్తున్నారు. సీసీఐ గతంలో నెలకోసారి ఓటీ (పత్తి శాతం), గింజల శాతం పెంచగా ఈ సారి ప్రతీ 15 రోజులకు ఓ సారి పత్తి, గింజల శాతం పెంచాలనే నిబంధనను మిల్లర్లు అంగీకరించడం లేదు. 'కపాస్ కిసాన్' యాప్ ద్వారా స్లాట్ బుకింగ్ విధానాన్ని కూడా వ్యతిరేకిస్తున్నారు. వీటితో పాటు ఇతర సమస్యలపై చర్చించాకే టెండర్లు వేయాలని భావనలో జిన్నింగ్ మిల్లుల యజమానులు ఉన్నారు.

యాప్‌తో అక్రమాలకు చెక్

పత్తి కొనుగోళ్లలో అక్రమాలకు చెక్ పెట్టేందుకు సీసీఐ 'కపాస్ కిసాన్' యాప్‌ను రూపొందించింది. ఈ యాప్‌లో పంట నమోదు చేసుకున్న రైతుల నుంచే సీసీఐ పత్తి కొనుగోలు చేస్తుంది. రైతులు స్లాట్ బుక్ చేసుకుని విక్రయించాలి. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఇప్పటి వరకు రైతులు ఆ యాప్‌లో పత్తి పంట విస్తీర్ణాన్ని నమోదు చేసుకోలేదు. ఏఈవోలు నమోదు చేసిన పంట విస్తీర్ణాన్ని (క్రాప్ బుకింగ్)వారి ద్వారానే 'కపాస్ కిసాన్' యాప్‌లో అప్‌లోడ్ చేయిస్తామని వ్యవసాయశాఖ జిల్లా అధికారులు చెబుతున్నారు. ఈ నెల రెండో వారంలో యాప్‌లో పత్తి పంట నమోదుపై ఏఈవోలకు శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిసింది. యాప్‌లో రైతు ఆధార్ కార్డు, పట్టాదారు పాస్‌పుస్తకం, బ్యాంక్ ఖాతా అనుసంధానం చేస్తారు. కౌలు రైతులు ఓటీపీ ద్వారా యాప్‌లో రిజిస్టర్ చేసుకోవచ్చు. డిజిటలైజేషన్‌తో పారదర్శకంగా పత్తి కొనుగోళ్లు, చెల్లింపు జరుగుతాయని అధికారులు చెబుతుండగా, ఈ నిబంధనలు కొనుగోళ్లకు అడ్డంకిగా మారుతాయని జిన్నింగ్ మిల్లుల యజమానులు ఆరోపిస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో 7.46లక్షల ఎకరాల్లో పత్తి సాగు

యాదాద్రి జిల్లాలో 1,07,710 ఎకరాల్లో, నల్లగొండ జిల్లాలో 5,47,735 ఎకరాల్లో, సూర్యాపేట జిల్లాలో 91వేల ఎకరాల్లో రైతులు

- మిగతా 6వ పేజీలో...

'ప్రజావాణి', పోలీస్ గ్రీవెన్స్‌డే రద్దు

నల్లగొండ, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): జడ్పీటీసీ, ఎంపీటీసీ, గ్రామపంచాయతీ ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉన్న దృష్ట్యా ప్రతీ సోమవారం నిర్వహించే 'ప్రజావాణి' కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ ఇలా త్రిపాఠి, పోలీస్ గ్రీవెన్స్‌డే రద్దు చేస్తున్నట్టు ఎస్పీ శరత్ చంద్రపవార్ ఆదివారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి ముగిసిన తరువాత యథావిధిగా 'ప్రజావాణి', పోలీస్ గ్రీవెన్స్‌డే ఉంటుందన్నారు. జిల్లా ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని వారు కోరారు.

హిందూ సంఘటన్‌తో దేశానికి రక్షణ

ఆర్ఎస్ఎస్ విభాగ్ సంఘ చాలక్ వెంకటయ్య



నల్లగొండలో ర్యాలీ నిర్వహిస్తున్న స్వయం సేవకులు

నల్లగొండ, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): హిందూ సంఘటన్ ద్వారానే దేశం రక్షణ సాధ్యమని, హిందువుల ఐక్యతకు పంచ పరివర్తన్ ద్వారా ఆర్ఎస్ఎస్ కృషి చేస్తోందని ఆర్ఎస్ఎస్ నల్లగొండ విభాగ్ సంఘ చాలక్ గార్లపాటి వెంకటయ్య అన్నారు. ఆర్ఎస్ఎస్ 100 ఏళ్ల స్థాపన ఉత్సవాల్లో భాగంగా ఆదివారం జిల్లా కేంద్రంలో నల్లగొండ నగరశాఖ ఆధ్వర్యంలో మేకల అభినవ్ స్టేడియం నుంచి ఎన్జీ కళాశాల వరకు స్వయం సేవకులు పద సంచలన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 1925లో ప్రారంభమై ప్రస్తుతం దేశ వ్యాప్తంగా విస్తృత శాఖలతో విభిన్న రంగాల్లో ఆర్ఎస్ఎస్ పనిచేస్తోందన్నారు. హిందువుల్లో ఐక్యతను సంఘం పెంపొందిస్తోందన్నారు. హిందుత్వ జీవన విధానం విశ్వ శాంతికి ఆధారమని, ప్రపంచంలోని వివిధ మతాలను సమన్వయపర్చే సనాతన జీవన విలువలు హిందుత్వంలో ఉన్నాయన్నారు. దేశ అభివృద్ధి కోసం, పంచ పరివర్తన కోసం హిందువులు పాటుపడాలని అన్నారు. కుటుంబ జీవన విలువలు, పర్యావరణ పరిరక్షణ, పౌర విధులను ప్రతీ ఒక్క కుటుంబం ఆచరించాలన్నారు. ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా జన జాగరణ చేపట్టనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో విభాగ్ సాహ సంఘ చాలక్ ఇటికాల కృష్ణయ్య, నగర సంఘ చాలక్ దోసపాటి శ్రీనివాస్, విభాగ్ ప్రచారక్ కాసం సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రజల కోసం పనిచేసే వారిని నిలపాలి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి

మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి

నల్లగొండ, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రజల కోసం, పార్టీ కోసం నమ్మకంగా పనిచేసే వ్యక్తులను పార్టీ అభ్యర్థులుగా సూచించాలని మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో తిప్పర్తి మండల స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో కొన్ని పొరపాట్లు జరిగిన మాట వాస్తవమేనని, వారిని నమ్మి పార్టీని చేతుల్లో పెడితే తీరా అసెంబ్లీ ఎన్నికల సమయంలో వెన్నుపోటు పొడిచి ద్రోహం చేశారన్నారు. ఈసారి అలా మోసపోకుండా పార్టీకి నమ్మకమైన వ్యక్తులను అభ్యర్థులుగా గుర్తించాలన్నారు. అంతేగాక వారి గెలుపునకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు కటికం సత్తయ్యగౌడ్, మందడి సైదిరెడ్డి, తండు సైదులుగౌడ్, పల్‌రెడ్డి రవీందర్‌రెడ్డి, లోడంగి గోవర్ధన్, సందీప్‌రెడ్డి, నర్సింహ, లక్ష్మయ్య, జ్యోతి, స్వరూప, నాగేశ్వర్‌రావు, సైదులు, విజయ, కొమ్ము గిరి, తదితరులు పాల్గొన్నారు.


ప్రకృతి సోయగం



పల్లెలు ప్రకృతి అందాలకు ఆలవాలంగా నిలుస్తాయి. నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలకేంద్రంలో ఆదివారం మధ్యాహ్నం ఆకాశం నల్లటి మబ్బులతో కనువిందు చేసింది. పచ్చటి పొలాల్లో, ఇళ్ల మధ్య కొబ్బరి చెట్లు, కారు మబ్బుల్లో కన్పించిన ఈ దృశ్యాలు మైమరిపించాయి.

- ఆంధ్రజ్యోతి, శాలిగౌరారం

సప్తవర్ణ శోభితం



ఉదయం సూరీడు ప్రకాశించగా, మధ్యాహ్న సమయంలో పట్టణంలో భారీ వర్షం కురిసింది. సాయంత్ర సమయంలో కాసింత ఎండ కాయగా, సాయంత్రానికి కారుమబ్బులు కమ్ముకున్నాయి. తూర్పున మబ్బులు, పడమర దిక్కున సూర్యాస్తమ సమయంలో స్వర్ణకాంతులతో ఆకాశం ఆహ్లాదకరంగా కనిపించింది. మిర్యాలగూడ పట్టణ నడిబొడ్డునున్న అశోక్‌నగర్ అంతస్తుల మీదుగా 'ఆంధ్రజ్యోతి' కెమెరా క్లిక్ మనిపించిన దృశ్యాలివి.

- ఆంధ్రజ్యోతి, మిర్యాలగూడ టౌన్

సందడిగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

శాలిగౌరారం, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలంలోని మాధవరం కలాన్ ఉన్నత పాఠశాల 1994-95 విద్యాసంవత్సరం పదో తరగతి పూర్వ విద్యార్థులు 30 సంవత్సరాల తర్వాత కలిశారు. ఆదివారం మండలంలోని పెర్కకొండారంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో గడిపిన రోజులు, ఉపాధ్యాయులు, స్నేహితులు మరపురాని గుర్తులుగా నిలిచిపోయాయని, పాత జ్ఞాపకాలు నెమరువేసుకున్నారు. ఈ ఆత్మీయ సమ్మేళనం మనలోని పాత స్నేహానికి మళ్లీ ప్రాణం పోసిందని కొనియాడారు. నిన్నటి ఆటలు, నవ్వులు, పాఠాలు, శిక్షలు ఇవన్నీ మళ్లీ మన కళ్ల ముందు కనిపిస్తున్నాయని పలువురు పేర్కొన్నారు. ఈ ఆనందానికి కారణమైన ప్రతీ ఒక్కరికి గురువులు, నిర్వాహకులు, పూర్వ విద్యార్థులు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారికి విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. అనంతరం ఆట పాటలతో సందడిగా గడిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వీరయ్య, అశోక్‌రెడ్డి, నర్సింహారెడ్డి, వెంకట్‌రెడ్డి, పూర్వవిద్యార్థులు కుంభం జానయ్య, రంగు భిక్షం, అన్నెబోయిన సైదులు, కప్పల రమేష్, రంగు జానయ్య, శ్రీనివాస్, వెంకన్న, లింగయ్య, తిరుమల్‌రెడ్డి, ఉమారాణి, సైదమ్మ, గంగదారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

మాజీమంత్రి ఆర్డీఆర్ అస్థికల నిమజ్జనం

● వాడపల్లి కృష్ణా, మూసీ సంగమంలో కలిపిన కుటుంబసభ్యులు



వాడపల్లి సంగమం వద్ద మాజీమంత్రి దామోదర్‌రెడ్డి అస్థికలు నిమజ్జనం చేస్తున్న కుటుంబసభ్యులు

దామరచర్ల, తుంగతుర్తి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి ఇటీవల మృతి చెందగా ఆయన అస్థికలను ఆదివారం నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం వాడపల్లి వద్ద గల కృష్ణా, మూసీ నదుల సంగమం వద్ద నిమజ్జనం చేశారు. ఆయన కుమారుడు రాంరెడ్డి సర్వోత్తమరెడ్డితో పాటు కుటుంబసభ్యులు వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ శాస్త్రోక్తంగా కృష్ణా, మూసీ నదుల సంగమం వద్ద నిమజ్జన కార్యక్రమం నిర్వహించారు. దామోదర్‌రెడ్డి సోదరులు గోపాల్‌రెడ్డి, కృష్ణారెడ్డి, సూర్యాపేట మార్కెట్ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు పోతు భాస్కర్, దామోదర్‌రెడ్డి మేనల్లుడు జెన్నారెడ్డి ప్రతాపరెడ్డి, పీసీసీ ప్రధాన కార్యదర్శి చకిలం రాజేశ్వర్‌రావు, కోతి గోపాల్‌రెడ్డి, ఎండీ. అంజద్‌అలి, కరుణాకర్‌రెడ్డి, అర్చకులు శ్రీరామ కవచం నాగయ్యశాస్త్రి, కాశి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

క్రైం పాయింట్ (Crime point)

అప్పుల బాధ తాళలేక వ్యక్తి ఆత్మహత్య

చౌటుప్పల్ రూరల్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): అప్పుల తాళలేక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్‌ఐ అజయ్ భార్గవ్ తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ మునిసిపాలిటీ కంచరకుంట్ల కాలనీకి చెందిన కొండ శ్రీనివాస్(40) కూలర్లు, ఫ్యాన్లు రిపేరు చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఇటీవల అప్పులు చేసి ఇల్లు నిర్మించుకున్నాడు. అప్పులకు వడ్డీలు, ఈఎంఐలు కట్టలేక మద్యానికి బానిసై తిరుగుతున్నాడు. ఈక్రమంలో భార్య పిల్లలతో కలిసి దసరా పండుగకు తల్లిగారింటికి వెళ్లింది. ఇంట్లోనే అతిగా మద్యం తాగి ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. భార్య వనజాత ఆదివారం ఇంటికి వచ్చి చూసేసరికి శ్రీనివాస్ మృతదేహం ఫ్యాన్‌కు ఉరేసుకుని వేలాడుతు కన్పించింది. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. భార్య వనజాత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మానసికంగా బాధపడుతూ..

మిర్యాలగూడ అర్బన్: ఉరివేసుకొని యువతి ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలం చింతపల్లి గ్రామపంచాయతీ ఆవాసగ్రామం బుడ్డతండాలో ఆదివారం జరిగింది. రూరల్ ఎస్‌ఐ లక్ష్మయ్య తెలిపిన వివరాల ప్రకారం... బుడ్డతండాకు చెందిన బానోతు దాసు చిన్న కుమార్తె బానోతు అనుజ(19) కొన్నాళ్లుగా హైదరాబాద్ నగరంలోని ఓ సెల్‌పాయింట్‌లో పనిచేస్తోంది. దసరా పండుగ సందర్భంగా వారం రోజుల క్రితం ఇంటికి వచ్చిన అనుజ మానసికంగా బాధపడుతూ ఇంట్లో ఎవరితోనూ అంతగా మాట్లాడేది కాదు. ఇంట్లో ఎవరూలేని సమయంలో ఫ్యాన్‌కొండికి చీరతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. అనుజ తండ్రి దాసు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

చౌటుప్పల్ రూరల్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం తూప్రాన్‌పేట శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో తల్లి, ఇద్దరు పిల్లలకు గాయాలయ్యాయి. ఎస్‌ఐ ఉపేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ కర్మన్‌ఘట్‌కు చెందిన కందగట్ల స్వప్న, రవి కిరణ్‌రెడ్డి , కూతురు అరింద్ వాహనంపై రోడ్డు క్రాస్ చేస్తుండగా విజయవాడ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్నకారు అతివేగంతో ఢీకొట్టింది. ఈ సంఘటనలో తల్లి స్వప్న, కుమారుడు, కూతురు గాయపడ్డారు. చికిత్స నిమిత్తం హైదరాబాద్ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

బాలుడిని కాపాడబోయి..

నల్లగొండ క్రైం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): నీటిలో కొట్టుకుపోతున్న బాలుడిని కాపాడే క్రమంలో ఓ మహిళ ప్రాణాలు కోల్పోయింది. ఈ సంఘటన నల్లగొండ సమీపంలోని కొత్తపల్లి గ్రామశివారులో ఎస్‌ఎల్‌బీసీ కాల్వ వద్ద జరిగింది. నల్లగొండ రూరల్ ఎస్‌ఐ సైదాబాబు తెలిపిన వివరాల ప్రకారం... నల్లగొండ మండలం కతాల్‌గూడకు చెందిన పగడాల అంజలి(28) ఆదివారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో కొత్తపల్లి గ్రామశివారులో ఎస్‌ఎల్‌బీసీ కాల్వ వద్ద దుస్తులు ఉతకడానికి వెళ్లింది. ఈ సమయంలో అదే గ్రామానికి చెందిన జిల్లేపల్లి దీక్షిత్(చిన్ను) అనే బాలుడు నీటిలో మునిగిపోతుండడాన్ని గమనించిన అంజలి రక్షించే ప్రయత్నం చేసింది. బాలుడు అంజలిని బిగ్గరగా పట్టుకోవడంతో ఇద్దరూ నీటిలో కొట్టుకుపోయారు. అక్కడున్న నారబోయిన రామకృష్ణ చూసి వారిని కాపాడే ప్రయత్నం చేయగా, దీక్షిత్‌ను కాపాడినప్పటికీ పగడాల అంజలి నీటి ప్రవాహంలో కొట్టుకుపోయింది. ఆమె ఆచూకీ కోసం వెతుకుతుండగా కొత్తపల్లి బ్రిడ్జివద్ద మృతదేహాన్ని గుర్తించారు. అంజలి భర్త కిరణ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రాకపోకలకు మూసీ బెంగ

⏵ మూసీని వదలని వరదలు ⏵ ఉధృతికి రుద్రవెల్లి-జూలూరులో లెవల్ బ్రిడ్జి ధ్వంసం ⏵ తాత్కాలిక మరమ్మతులతో సరి



మూసీకి వరద పోటెత్తడంతో జూలూరు వైపు కొట్టుకుపోయిన బ్రిడ్జి రోడ్డు మార్గం

బీబీనగర్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): మూసీని వరదలు వదలడం లేదు. దీంతో పలు గ్రామాలకు రాకపోకలకు తీవ్ర ఆటంకం కలుగుతోంది. రెండు నెలలు 13సార్లు మూసీకి వరద పోటెత్తింది. దీంతో యాదాద్రి భువనగిరి జిల్లా పరిధిలోని బీబీనగర్-భూదాన్‌పోచంపల్లి మార్గంలో రుద్రవెల్లి-జూలూరు గ్రామాల మధ్యన మూసీపై నిర్మించిన పురాతన లో లెవల్ బ్రిడ్జికి ప్రమాదం పొంచి ఉంది. ఇప్పటికే నీటి ఉధృతికి బ్రిడ్జి అడుగు భాగంలో పునాదులు కుంగిపోయి కొంత భాగం కూలింది. మరో వైపు నీటి ప్రవాహ వేగానికి రోడ్డు కొట్టుకుపోయింది. రెండు మూడు రోజుల పాటు రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. అధికారులు అప్రమత్తమై తాత్కాలిక మరమ్మతులు చేపట్టడంతో అతి కష్టంగా రాకపోకలు కొనసాగుతున్నా యి. గత నెల 26, 27, 28వ తేదీల్లో మూసీకి వరదల తాకిడికి రుద్రవెల్లి వైపు బ్రిడ్జి స్టాటింగ్ పాయింట్ వద్ద పునాదులు కుంగిపోయి కొంత భాగం కూలింది. అటు జూలూరు వైపు బ్రిడ్జి రోడ్డు పూర్తిగా కొట్టుకుపోయింది. దీంతో సెప్టెంబరు 29,30న రెండు రోజులు బీబీనగర్-పోచంపల్లి మార్గంలో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. అధికారులు స్పందించి రోడ్డు కొట్టుకుపోయిన చోట తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. ఇటు రుద్రవెల్లి వైపు బ్రిడ్జి కూలిన ప్రదేశంలో ప్రమాదం పొంచి ఉంది అన్న సూచికగా రాళ్లను అడ్డు పెట్టి చేతులు దులిపేసుకున్నారు. కుంగిన చోట ఏ క్షణమైనా బ్రిడ్జి కూలిపోయే పరిస్థితి నెలకొంది. మరో మార్గం లేక రెండు మండలాల ప్రజలు ప్రమాదం అంచు న రాకపోకలు కొనసాగిస్తున్నారు. జరగరానిది జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఆదివారం మూసీకి మరోసారి వరద పోటెత్తింది. హైదరాబాద్‌లోని ఎగువ ప్రాంతాల నుంచి జలాశయాలకు భారీగా వరద నీరు వచ్చి చేరుతుండడంతో ఎగువ నుంచి వచ్చిన నీటిని వచ్చినట్టుగా జలాశయాల నుంచి దిగువనున్న మూసీకి నీటిని వదులుతున్నారు. దీం తో ఆదివారం తెల్లవారుజాము నుంచే బీబీనగర్ మండల పరిధిలో మూసీ మరోసారి పరవళ్లు తొక్కుతోంది. రుద్రవెల్లి- జూలూరు మధ్య లో లెవల్ బ్రిడ్జిపై నుంచి వరద నీరు ప్రవహిస్తుండడంతో రాకపోకలు నిలిపివేశారు. వరద మరికొన్నాళ్లు ఇలాగే కొనసాగితే బ్రిడ్జి పూర్తిగా కూలిపోయే ప్రమాదముంది. అదేజరిగితే హైదరాబాద్- వరంగల్, హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారులను కలుపుతూ అనుసంధానంగా ఉన్న బీబీనగర్-భూదాన్‌పోచంపల్లి మార్గంలో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయే ప్రమాదముంది. ఇక్కడి గ్రామాల ప్రజలు పోచంపల్లి, బీబీనగర్, భువనగిరి, చౌటుప్పల్, యాదగిరిగుట్ట, హైదరాబాద్, చౌటుప్పల్ తదితర ప్రాంతాలకు వెళ్లాల్సిన వారు భట్టుగూడెం, పెద్దరావులపల్లి, మక్తానంతారం, పిలాయిపల్లి మార్గాల ద్వారా వ్యయ ప్రయాసాలకోర్చి రాకపోకలు కొనసాగించాల్సిన పరిస్థితి నెలకొంది.

జూలూరు-రుద్రవెల్లి గ్రామాల రాకపోకల బంద్

భూదాన్‌పోచంపల్లి: యాదాద్రి-భువనగిరి జిల్లాలోని బీబీనగర్, భూదాన్‌పోచంపల్లి మండలాల్లోని లోలెవల్ బ్రిడ్జీలపై మూసీలో వరద ఉధృతి పెరిగి ఉప్పొంగి ప్రవహిస్తోంది. భూదాన్‌పోచంపల్లి మండలం జూలూరు - బీబీనగర్ మండలం రుద్రవెల్లి గ్రామాల మధ్యన ఉన్న మూసీ లోలెవల్ బ్రిడ్జీపై వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో శనివారం రాత్రి నుంచి రహదారిపై రాకపోకలు నిలిపివేశారు. ఇరు గ్రామాల మధ్యన రాకపోకలకు తీవ్ర అంతరాయం నెలకొంది. భూదాన్‌పోచంపల్లి నుంచి బీబీనగర్‌కు వెళ్లేందుకు ఈ రహదారి ప్రధాన రహదారి కావడంతో నిత్యం వదంలాది మంది ప్రజలు, ప్రయాణికులు ఈ బ్రిడ్జిపై నుంచి రాకపోకలు సాగిస్తుంటారు. బీబీనగర్, భువనగిరికి వెళ్లాలంటే పెద్దరావులపల్లి, భట్టుగూడెం మీదుగా 20 కిలో మీటర్ల దూరం తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ రహదారిపై రాకపోకలు నిలిపివేయడంతో ప్రయణికులకు దూరాభారం పెరిగింది.



జూలూరు-రుద్రవెల్లి గ్రామాల మధ్యన లోలెవల్ బ్రిడ్జి వద్ద రాకపోకలు నిలిపివేస్తూ ఏర్పాటు చేసిన బారికేడ్లు

మరోసారి పొంగిప్రవహించిన మూసీ



రుద్రవెల్లి వద్దలో లెవల్ బ్రిడ్జి పై నుంచి ప్రవహిస్తున్న మూసీ

బీబీనగర్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): మూసీకి మరోసారి వరద ఉధృతి పెరిగింది. హైదరాబాద్ ఎగువ ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాలకు హైదరాబాద్‌లోని 3 ప్రధాన జలాశయాలకు భారీగా వరద నీరు వచ్చి చేరుతుంది. దాంతో అధికారులు పై నుంచి వచ్చిన వరద నీటినంతా గేట్లు తెరిచి దిగువ మూసీకి వదులుతున్నారు. దీంతో బీబీనగర్ మండలంలో ఆదివారం తెల్లవారు జాము నుంచి మూసీ మరోసారి పొంగి ప్రవహిస్తుంది. దీంతో బీబీనగర్-పోచంపల్లి మార్గంలో రుద్రవెల్లి- జూలూరు గ్రామాల మధ్యన లో లెవల్ బ్రిడ్జిపై నుంచి మూసీ ప్రవహిస్తుంది. ఈ మార్గంలో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి.

యాదగిరిగుట్టలో భక్తుల రద్దీ



ఆలయ ఉత్తర తిరువీధిలో భక్తుల రద్దీ

యాదగిరిగుట్ట, అక్టోబరు5(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దర్శనం కోసం రాష్ట్ర నలుమూలల నుంచి తరలివచ్చిన భక్తులతో కొండపై రద్దీ ఏర్పడింది. ఇష్టదైవాలను దర్శించుకునేందుకు ఆదివారం పెద్దసంఖ్యలో తరలివచ్చారు. సుమారు 46వేల మంది భక్తులు రాగా ఉభయ (ప్రత్యేక, ధర్మదర్శనం) క్యూలైన్లు భక్తులతో ఉదయం నుంచి రాత్రి వరకు రద్దీ కొనసాగింది. ప్రత్యేక దర్శనానికి అరగంట, ధర్మదర్శనానికి గంట సమయం పట్టిందని భక్తులు తెలిపారు. ఉదయం, సాయంత్రం బ్రేక్ దర్శనం, మధ్యాహ్నం రాజభోగం(ఆరగింపు) సమయాల్లో మూడు గంటల పాటు ఉభయ క్యూలైన్లల్లో భక్తుల వేచి ఉన్నారు. కొండపైన ఆర్టీసీ ప్రాంగణం వాహనాల పార్కింగ్‌తో నిండింది. ప్రధానాలయం, కల్యాణోత్సవం, వ్రత మండపాలు, ఆలయ తిరువీధులు, ప్రసాద విక్రయశాల వద్ద కూడా రద్దీ కన్పించింది. వివిధ విభాగాల ద్వారా ఆలయ ఖజానాకు రూ.50,54,516ల ఆదాయం సమకూరినట్లు ఇన్‌చార్జి ఈవో గుగులోతు రవినాయక్ తెలిపారు.

శాస్త్రోక్తంగా నిత్య పూజలు

స్వామి అమ్మవారికి సంప్రదాయరీతిలో నిత్యపూజలు నిర్వహించారు. గర్భాలయంలో స్వయంభువులకు అభిషేకం, అర్చనలు, ప్రాకార మండపంలో హోమం, నిత్య కల్యాణోత్సవ పర్వాలు వైభవంగా నిర్వహించారు. పాతగుట్టలోనూ నిత్య పూజలు ఘనంగా నిర్వహించారు.



స్వామివారి సన్నిధిలో డీజీపీ

స్వామిని కొత్త డీజీపీ బి. శివధర్‌రెడ్డి సతిసమేతంగా దర్శించుకున్నారు. డీజీపీగా బాధ్యతలు చేపట్టిన తొలిసారి స్వామివారి దర్శనార్థం ఉదయమే విచ్చేశారు. ప్రొటోకాల్ కార్యాలయం వద్ద కలెక్టర్ ఎం. హనుమంతరావు, డీసీపీ ఆక్షాంశ్‌యాదవ్, ఆర్డీవో మాలి క్రిష్ణారెడ్డి, అధికారులు స్వాగతం పలికగా అక్కడే పోలీసుల గౌరవ వందనం చేశారు. డీజీపీ దంపతులకు ఆలయ ప్రధానార్చకులు కాండూరి వెంకటాచార్యులు, భట్టర్ సురేంద్రాచార్యులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. గర్భాలయం అభిముఖంగా వేద పండితులు వేద ఆశీర్వచనం చేశారు. ఇన్‌చార్జి డీఈవో జూశెట్టి క్రిష్ణ, ఏఈవోలు గజ్వేల్లి రఘు, ప్రతాప నవీన్‌కుమార్‌శర్మ లడ్డు ప్రసాదం, స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు.

డబుల్ రోడ్డుకు పచ్చజెండా

● యాతవాకిళ్ల- హుజూర్‌నగర్ రోడ్డుకు రూ.20కోట్లు మంజూరు ● తీరనున్న ప్రజల రవాణా కష్టాలు



డబుల్ రోడ్డుగా మారనున్న యాతవాకిళ్ల- హుజూర్‌నగర్ రోడ్డు

మఠంపల్లి, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలంలోని యాతవాకిళ్ల నుంచి హుజూర్‌నగర్ వరకు గల సింగిల్ లైన్ రోడ్డును డబుల్ రోడ్డుగా మార్చేందుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు రూ.20కోట్లు నిధులు మంజూరు చేసింది. ఇటీవల నీటిపారుదల, పౌర సరఫరా శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఈ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. దీంతో సింగిల్ లేన్‌గా ఉన్న యాతవాకిళ్ల రోడ్డు డబుల్ రోడ్డు మారనుంది.

ఏళ్లతరబడి ఎదురుచూస్తున్న ప్రజలు

యాతవాకిళ్ల-హుజూర్‌నగర్ రోడ్డుపై నుంచే మండలంలోని యాతవాకిళ్ల, బీల్యానాయక్‌తండా, చెన్నాయిపాలెం, కామాంచికుంటతండా తదితర గ్రామాలతో పాటు హుజూర్‌నగర్, గరిడేపల్లి, పాలకవీడు, జాన్‌పహాడ్‌తో పాటు నేరేడుచర్ల మండలాలకు చెందిన పలు గ్రామాల ప్రజలు హుజూర్‌నగర్ చేరుకునేందుకు నిత్యం వెళ్తుంటారు. ప్రస్తుత సింగిల్ రోడ్డు అధ్వానంగా ఉండడంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డుపై దశాబ్దాకాలంగా కనీసం యాతవాకిళ్లకు బస్సు సౌకర్యం లేకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలకు తిప్పలు తప్పడం లేదు. రాత్రి సమయాల్లో ఇతర గ్రామాలకు వెళ్లేందుకు వాహనాలు దొరకని దుస్థితి. అదే విధంగా ఈ రోడ్డుపై అధ్వానంగా ఉన్న రోడ్డుతో ప్రమాదాలు జరుగుతున్నాయి. త్వరలో డబుల్ రోడ్డుగా మారితే ఈ సమస్యలన్నీ పరిష్కారం కానున్నాయి. హుజూర్‌నగర్ మండలంలోని లింగగిరి వరకు ఇప్పటికే డబుల్ రోడ్డు నిర్మాణం పూర్తికాగ శ్రీనివాసపురం, అమరవరం, తదితర గ్రామాల మీదిగా యాతవాకిళ్ల గ్రామానికి 9.5 కిలోమీటర్లు మేర డబుల్‌రోడ్డు నిర్మించాల్సి ఉంది. ఈ రోడ్డు నిర్మాణంతో ఆయా గ్రామాల ప్రజలకు కష్టాలు తీరనున్నాయి. ప్రయాణం సౌకర్యవంతం కానుంది. ప్రజల రాకపోకలకు ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనాలు అందుబాటులో ఉండనున్నాయి. డబుల్ రోడ్డు నిర్మాణ పనులను త్వరతగతిన చేపట్టి సకాలంలో పూర్తి చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.


ప్రయాణం సుగమం కానుంది



యాతవాకిళ్ల నుంచి హుజూర్‌నగర్ వరకు డబుల్ రోడ్డు నిర్మాణం పూర్తయితే ప్రయాణం సుగమం అవుతుంది. డబుల్ రోడ్డు కోసం రూ.20కోట్లు ప్రభుత్వం మంజూరు చేయడం సంతోషంగా ఉంది. యాతవాకిళ్ల నుంచి నియోజకవర్గ కేంద్రానికి వెళ్లేందుకు రహదారి సక్రమంగా లేక కొన్నేళ్లుగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం.ఈ రోడ్డు నిర్మాణం జరిగితే కష్టాలు తీరనున్నాయి.

కుక్కల నాగరాజు యాతవాకిళ్ళ

ఎన్నోఏళ్లుగా ఎదురుచూస్తున్న కల నెరవేరింది



మఠంపల్లి మండలంలో రోడ్డు 10ఏళ్లుగా బీటీకి నోచుకోక ఇబ్బందులు పడుతున్నాం. యాతవాకిళ్ళ రోడ్డు సింగిల్ లేన్‌గా ఉండడంతో అనేక ఇబ్బందులు పడుతున్నాం. రోడ్డును కంపచెట్లు కమ్మేయడంతో రాత్రి సమయంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. మంత్రి ఉత్తమ్ సహకారంతో డబుల్ రోడ్డు మంజూరు కావడం హర్షణీయం. రోడ్డు పనులు పూర్తయితే చుట్టుపక్కల గ్రామాలకు వెళ్లడం సుగమం అవుతుంది.

● భూక్యా మంజూనాయక్, మాజీ జడ్పీటీసీ

గిరిజన ఆణిముత్యాలు

కృషి, పట్టుదల ఉంటే సాధించలేనిది ఏమి లేదని నిరూపిస్తున్నారు గిరిజన విద్యార్థులు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివినా ఉన్నత స్థానాల్లో ఉండాలనే లక్ష్యంతో చదివి ప్రభుత్వ కళాశాలల్లో మెడికల్, ఐఐటీ సీట్లు సాధించారు. మరో గిరిజన కుటుంబానికి చెందిన కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో గ్రూప్స్‌లో అక్కా తమ్ముడు ఉన్నత ఉద్యోగాలు పొందారు. తల్లిదండ్రుల ఆశలు, ఆశయాలకు అనుగుణంగా లక్ష్యసాధనకు పోరాడి సాధించారు. తమ కలలను సాకారం చేసుకున్నారు.

– ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్ వర్క్

మెడికల్, ఐఐటీ సీటు సాధించిన అక్కాచెల్లెళ్లు ధరావత్ స్పందన, అమృత



(ఆంధ్రజ్యోతి-మఠంపల్లి) :సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలం భీల్యానాయక్‌తండాకు చెందిన మాజీ సర్పంచ్ ధరావత్ నాగమణి.నవీన్ నాయక్‌కు ఇద్దరు కుమార్తెలు. నిరుపేద కుటుంబం ఉన్నప్పటికీ తల్లిదండ్రులు ఉన్నత విద్యావంతులు కావడంతో కుమార్తెలు క్రమశిక్షణ, పట్టుదలతో చదివి ఒకరు ఎంబీబీఎస్, మరొకరు ఐఐటీలో సీటు సాధించారు. పెద్ద కుమార్తె ధరావత్ స్పందన, అమృత 1 నుంచి 10 వరకు తరగతి హుజూర్‌నగర్‌లోని ప్రైవే ట్ పాఠశాలలో చదివారు. స్పందన ఇంటర్ హైదరాబాద్‌లోని జూనియర్ కళాశాలలో బైపీసీ పూర్తి చేసి 1000 మార్కులకు 984 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచారు. ఇక నీట్‌లో మంచి ర్యాంకు సాధించి ప్రొఫెసర్ జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో సీటు సాధించారు. అమృత రంగారెడ్డి జిల్లా కోహెడలో ఓ ప్రైవేటు కళాశాలలో చదివి 1000 మార్కులకు 976 మార్కులు సాధించింది. జేఈఈ అడ్వాన్స్, మెయిన్స్ పరీక్షల్లో అర్హత సాధించి జార్ఖండ్‌లోని ధన్‌బాద్ ఐఐటీ సీటు సాధించారు. మెడికల్ కాలేజ్, ఐఐటీ సీటు సాధించిన అక్కాచెల్లెళ్లను తల్లిదండ్రులతో పాటు పలువురు ఉద్యోగులు, లంబాడీ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

అక్కాతమ్ముడికి గ్రూప్-1, 2 ఉద్యోగాలు

(ఆంధ్రజ్యోతి-దేవరకొండ): నల్లగొండ జిల్లా దేవరకొండ మండలం శేరిపల్లి జేత్యతండాకు చెందిన వరసకు అక్కా, తమ్ముడు గ్రూప్-1,2 ఉద్యోగాలు సాధించారు. శేరిపల్లి జేత్యతండాకు చెందిన విశ్రాంత కండక్టర్ రమావత్ ధరమ్‌సింగ్, రుక్మిణి దంపతులకు ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు. పెద్ద కుమా ర్తె అలివేలు మంగమ్మ, లోకిలాల్ దంపతుల పెద్ద కుమార్తె లోనావత్ నేహ. జేఎన్‌టీయూలో బీటెక్ పూర్తి చేసింది.

ప్రస్తుతం నల్లగొండ కలెక్టరేట్‌లో రెవెన్యూ శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తోంది. అక్కడ పనిచేస్తూనే గ్రూప్స్‌కు సిద్ధమవుతోంది. అందులో భాగంగా ఇటీవల విడుదలైన గ్రూప్-2 ఫలితాల్లో నేహ అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా ఉద్యోగం సాధించింది. నేహ తండ్రి లోకిలాల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు గా పనిచేస్తున్నారు. ధరమ్‌సింగ్ రెండో కుమార్తె ఇస్లావత్ స్నేహ,హనుమంతు దంపతుల కుమారుడైనా ఇస్లావత్ శ్రీరాం హరిష్ ఢిల్లీలో ఐఐటీ పూర్తి చేశాడు.



ఉద్యోగాలు సాధించిన నేహ, శ్రీరాంహరీష్‌తో కుటుంబ సభ్యులు

ఇటీవల వెల్లడైన గ్రూప్-1 ఫలితాల్లో ఎక్సైజ్‌శాఖలో అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఉద్యోగం సాధించాడు. హనుమంతు తండ్రి పే అండ్ అకౌంట్ ఆఫీసర్ పనిచేస్తున్నారు. అక్క, చెల్లెలు కుమార్తె, కుమారుడు ఇద్దరు ఒకే కుటుంబంలో గ్రూప్-1, 2 ఉద్యోగాలు సాధించారు. దసరా పండుగకు అమ్మమ్మ గ్రామంమైన శేరిపల్లి జేత్యతండాకు వీరు వచ్చారు. వీరిని దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్, పలువురు గిరిజన సంఘాల నేతలు అభినందించారు.

కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతోనే..



చిన్నప్పటి నుంచి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు చదువుకోవాలని ప్రోత్సహించారు. 5వతరగతి వరకు దేవరకొండలో చదివాను. 6 నుంచి 10వ తరగతి వరకు నల్లగొండ లిటిల్‌ఫ్లవర్ స్కూల్‌లో చదివాను. ఇంటర్ నుంచి బీటెక్ వరకు హైదరాబాద్‌లో చదివాను. మొదటి నుంచి మా కుటుంబ సభ్యులు ఎంతగానో ప్రోత్సహించారు. కష్టపడి చదివి ఉద్యోగం సాధించడం ఆనందంగా ఉంది.

– లోనావత్ నేహ

ఐపీఎస్ సాధించడమే లక్ష్యం



మా అమ్మమ్మ ఊరు జేత్యతండా. మా నాన్న స్వగ్రామం డిండి మండలం సోమ్లాతండా. నాన్న పే అండ్ అకౌంట్ ఆఫీసర్‌గా ఉద్యోగం చేస్తుండడంతో హైదరాబాద్‌లోనే చదివాను. ఐపీఎస్ కావాలనే లక్ష్యంగా సివిల్స్ రాశాను. ఐపీఎస్ కోసం కష్టపడతాను. ఇదే క్రమంలో గ్రూప్-1 పరీక్ష కూడ రాశాను. ఫలితాల్లో ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండ్‌గా ఎంపికయ్యా. మా తల్లి దండ్రులు, నాలక్ష్యం నెరవేరింది.

– ఇస్లావత్ శ్రీరాం హరీష్

ఆ నిబంధనలు సడలించాలి

వాహనదారులు చలాన్లపై ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా ఇప్పటి నుంచి ఇబ్బందులు పడాల్సిందే. ఎంవీ(మోటార్ వెహికిల్) యాక్టు కింద ఒక వాహనంపై 5 కంటే ఎక్కువగా చలాన్ల జారీ అయితే డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేసే అవకాశం ఉంది. ముఖ్యంగా కేంద్ర ప్రభు త్వం మోటారు వెహికల్ రూల్స్ 1989 ప్రకారం కేంద్ర రవాణా శాఖ కీలక సవరణ చేపట్టింది. ఈ విషయమై పలువురు తమ అభిప్రాయాలను వెల్లడించారు.

– (ఆంధ్రజ్యోతి -సూర్యాపేట టౌన్)

చలాన్లపై కఠిన వైఖరి తగదు.



వాహనంపై పడిన చలాన్లను 45 రోజుల్లో చెల్లించాలనే నిబంధనతో కొంత ఇబ్బంది. చలాన్లపై కఠిన వైఖరితో సామాన్యులకు ఇబ్బందులు పడతారు. ఐదుకు మించి చలాన్ల ఉంటే వాహనాన్ని సీజ్ చేసి, లైసెన్స్ రద్దు చేయడం సరికాదు. కొద్దిగా సమయం ఇవ్వాలి. అలాగే రాష్ డ్రైవింగ్ చేసే వారికి ఇది చెక్ పెట్టే అవకాశం ఉంది. 5 చలాన్లు ఎక్కడ పడతాయే అనే భయం ఉంటుంది. అధికారులు వాహనాన్ని స్వాధీనం చేసుకునే నిబంధన తొలగించాలి.

– మరికంటి హరీష్

డ్రైవింగ్ చేసిన వ్యక్తిని బాధ్యుడిని చేయడం బాగుంది..



చలాన్లు వేసే సమయంలో యజమాని వాహనం నడపకుండా ఉండి వేరే వ్యక్తులు వాహనం నడిపితే వారిని బాధ్యులు చేయడం బాగుంది. దీని మూలంగా మైనర్‌ల కు వాహనాలు తొలకుండా అవుతుంది. పిల్లలకు వాహనాలు ఇవ్వాలన్నా తల్లిదండ్రులు కొంత జంకుతారు. చలాన్ల సమయం పెంచాలి. మహిళలకు రాష్ డ్రైవింగ్ చేసే వారి నుంచి తిప్పలు తప్పుతాయి.

– సంతోషిమాత

వాహనాలు విక్రయించే పరిస్థితి లేదు



ప్రభుత్వం కొత్తగా తీసుకువస్తున్న విధానంతో వాహనాలు విక్రయించే పరిస్థితి లేదు. ముఖ్యంగా ఆలస్యం చేస్తే చలాన్ల పడిన వాహనాలను ఎవరికీ విక్రయించే అవకాశం ఉండదు. ఎలాంటి లావాదేవీలకు అవకాశం లేకుండా పోతుంది. కనీసం రెన్యువల్‌కు సైతం అవకాశం లేకపోవడం వాహనదారులకు కష్టమే. ఎలాంటి అజాగ్రత్తకు తావివ్వకుండా చూసుకోవాలి. ఎంవీ యాక్టు అమలు మరోసారి ఆలోచించాలి. 90 రోజుల చలాన్ల 45 రోజులకు కుదించడం దారుణం.

– కుమార్

ఐదుకు మించి నిబంధనలు తొలగించాలి



ఒక వాహనంపై ఐదు వాహనాలకు మించి చలాన్లు ఉండకూడదనే నిబంధన సరి కాదు. కొంత చలాన్ల చెల్లింపునకు వేచి చూడాలి. ప్రస్తుతం 45 రోజుల్లో చెల్లించాలంటే ఇబ్బంది అవుతుంది. గతంలో మాదిరగా 90 రోజుల కాలపరిమితి ఉండాలి. చలాన్ల పేరుతో వాహనాదారుల ను, లైసెన్స్ దారులను ఇబ్బంది పెట్టే ప్రయత్నం జరుగుతోంది. చలాన్లకు రాయితీ ఇచ్చి మాఫీ చేసే చర్యలు తీసుకుంటే బాగుంటుంది.

– నాగరాజు

నేత్రదానంతో మరలా జీవించవచ్చు

నార్కట్‌పల్లి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): నేత్రదానం చేయడం ద్వారా నలుగురికి చూపునిచ్చి వారిలో మరలా జీవించవచ్చని లయన్స్ క్లబ్ ఆఫ్ నల్లగొండ ఛారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ కెవి.ప్రసాద్ అన్నారు. నీటి సంపులో పడి మృతిచెందిన విద్యార్థి రిషిక్ కుటుంబసభ్యుల అనుమతితో ఆదివారం లయన్స్ క్లబ్ ఆఫ్ నల్లగొండ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలోని ఐ డొనేషన్ సెంటర్ వైద్యులు కంటి కార్నియాను సేకరించారు. తహసీల్దార్ శివకుమార్, మృతుడి తల్లిదండ్రులు నాగరాజు డాక్టర్ హరనాథ్ కడిమి, పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో 9 గొర్రెలు మృతి

- మరో 70 గొర్రెలకు తీవ్ర అస్వస్థత
- రసాయన పదార్థాలను తిన్నాయని అనుమానం
- గుట్ట వద్ద రసాయన పదార్థాల బస్తాలు

చిట్యాలరూరల్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో 9 గొర్రెలు మృతి చెందగా మరో 70 గొర్రెలు అస్వస్థతకు గురయ్యాయి. మేకలు మేత మేస్తున్న సమీపంలోనే రసాయనాలతో కూడిన పదార్థాలను తిన్నట్లు అనుమానం వ్యక్తమవుతోంది. ఈ సంఘటన నల్లగొండ జిల్లా చిట్యాల మండలం పిట్టంపల్లి శివారులో ఆదివారం జరిగింది. బాధిత రైతు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పిట్టంపల్లికి చెందిన మెట్టు లింగయ్యకు సుమారు 300 గొర్రెలు ఉన్నాయి. మేత కోసం గ్రామశివారులో వ్యవసాయ బావుల ప్రాంతానికి మూగజీవాలను రోజు మాదిరిగానే లింగయ్య భార్య సుగుణమ్మ, కుమారుడు కిరణ్ వాటిని తోలుకొని వెళ్లాడు. గొర్రెలు చెట్లు, ఆకులను మేస్తూ పలు ప్రాంతాలకు వెళ్లాయి. అటువైపుగా ఉన్న గుట్ట సమీపంలోకి వెళ్లగా గుర్తు తెలియని వ్యక్తులు వదిలేసిన రసాయనాలతో కూడిన పదార్థాల బస్తాలు కనిపించడంతో వాటి వద్దకు వెళ్లి బస్తాల్లోని పదార్థాలను తిన్నాయి. మేత మేసి కొట్టంలోకి వచ్చిన గొర్రెలు రెండు రోజులుగా అస్వస్థతకు గురైయ్యాయి. కొన్ని గొర్రెలు రక్తంతో కూడిన మలాన్ని విసర్జించడంతో పాటు 9 గొర్రెలు మృతి చెందాయి. మరికొన్ని అస్వస్థతకు గురవడంతో మెట్టు లింగయ్య పశు వైద్యాధికారి, సిబ్బందికి సమాచారం అందించాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న వారు గొర్రెలను పరిశీలించి ఏమైనా విషం తిని ఉండవచ్చనే భావనతో చికిత్స చేపట్టారు. మేతకోసం వెళ్లిన గొర్రెలు చెట్ల ఆకులను తినడమే కాకుండా అక్కడ బస్తాల్లో ఉన్న పదార్థాలను కూడా తినడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని బాధిత రైతు మెట్టు లింగయ్య, భార్య సుగుణమ్మ, కుమారుడు కిరణ్ కన్నీటి పర్యంతమయ్యాడు.



చిట్యాల మండలం పిట్టంపల్లి శివారులో గుర్తుతెలియని వ్యక్తులు వదిలిన రసాయనాలతో కూడిన పదార్థాల బస్తాలు



చిట్యాల మండలం పిట్టంపల్లి శివారులో గొర్రెలకు ఇంజక్షన్ చేస్తున్న వీఎల్ఓ శ్రీనివాసరావు

గిన్నిస్ వరల్డ్ రికార్డ్‌లో భాగస్వామ్యం

- కరాటే పోటీల్లో పాల్గొన్న చలకుర్తి చిన్నారులు



గిన్నీస్ రికార్డుతో చలకుర్తి గ్రామానికి చెందిన చిన్నారులు సుదీక్ష, విహాస్‌లు

పెద్దవూర, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): చెన్నైలో ఎస్ఐవీఈటీ కళాశాల మైదానంలో నిర్వహించిన గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ టైటిల్ అటెండ్ లార్జెస్ట్ కరాటే డిస్‌ప్లేలో నల్లగొండ జిల్లా పెద్దవూర మండలంలోని చలకుర్తి గ్రామానికి చెంది చిన్నారులు సుదీక్ష, విహాస్‌లు పాల్గొన్నారు. గిన్నీస్ వరల్డ్ రికార్డ్ సాధించడంలో భాగస్వాములయ్యారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, కేరళకు చెందిన పలువురు కరాటే క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారులు సుదీక్ష, విహాస్ మాట్లాడుతూ గిన్నీస్ రికార్డు సాధించడం సంతోషంగా ఉందన్నారు. మున్ముందు మరింత కఠోర శ్రమతో సాధన చేసి మరెన్నో అంతర్జాతీయ పతకాలు సా ధించి పుట్టిన ఊరికి, తెలంగాణ రాష్ట్రానికి పేరు తీసుకొస్తామని అన్నారు. చిన్ననాటి నుంచే తమకు శిక్షణ ఇప్పించి, నిరంతరం తమ వెంట ఉండి నడిపిస్తున్న తల్లిదండ్రులకు, శిక్షణలో మెళకువలను నేర్పి చి మంచి అవకాశాలు ఏర్పాటు చేసిన కోచ్ మహేష్‌నాయక్‌కు ధన్యవాదాలు తెలిపారు.

వాహనాలన్నీ హైదరాబాద్ వైపే..

- తిరుగు ప్రయాణ వాహనాలతో కిక్కిరిసిన జాతీయ రహదారులు
- పట్టణాల్లో నెమ్మదిగా కదిలిన వాహనాలు

చౌటుప్పల్ రూరల్/చౌటుప్పల్ టౌన్ /బీబీనగర్/చిట్యాల /చిట్యాల రూరల్ /కేతేపల్లి/కోదాడ రూరల్,అక్టోబరు5(ఆంధ్రజ్యోతి): బతుకమ్మ, దసరా పండుగ సెలవులు ముగియడంతో ఉమ్మడి నల్లగొండ జిల్లాలతో పాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పలు జిల్లాలకు చెందిన ప్రయాణికులు ఆదివారం హైదరాబా ద్ బాట పట్టారు. దీంతో హైదరాబాద్-విజయవాడ, వరంగల్-హైదరాబాద్ జాతీయ రహదారులపై ప్రయాణం రద్దీ నెలకొంది. సోమవారం నుంచి విద్యాసంస్థలు ప్రారంభం కానుండడంతో ప్రజలు పల్లెల నుంచి పట్టణాలకు బయలు దేరారు. చౌటుప్పల్ మండలం పంతంగి టోల్ గేటు వద్ద తిరుగు ప్రయాణికుల రద్దీ నెలకొంది. వాహనాల రద్దీ ఎక్కువగా ఉండడం తో 16గేట్లకు 10గేట్ల ద్వారా వాహనాలను హైదరాబాద్ వైపు పంపించారు. సాధారణ రోజుల్లో 30వేలకు పైగా వాహనాలు రాకపోకలు సాగిస్తుండగా దసరా తిరుగు ప్రయాణంతో అదనంగా 15వేల వాహనాలు రాకపోకలు సాగించాయి. వాహనాలు ఐదు వరసల్లో నెమ్మదిగా హైదరాబాద్ వైపు కదిలాయి. చౌటుప్పల్ పట్టణంలోని రెండు కిలో మీటర్ల పొడవునా వాహనాల రద్దీ అధికంగా కనిపించింది.

రెండు కిలోమీటర్లు ట్రాఫిక్ జామ్

చిట్యాల పట్టణం, మండలంలోని పెద్దకాపర్తి వద్ద ఫ్లైవర్ బ్రిడ్జి పనులు జరుగుతుండగా వాహనాలు రహదారి నుంచి సర్వీస్ రోడ్డు మీదుగా మళ్లే సమయం లో నిదానంగా వెళ్లాయి. దీంతో వాహనాలు ఒకేసారి రావడంతో జాతీయ రహదారిపై రెండు కిలోమీటర్ల మేరకు ట్రాఫిక్‌జామ్ అయ్యింది.

కిక్కిరిసిన కేతేపల్లి టోల్ ప్లాజా

కేతేపల్లి మండలంలోని టోల్‌ప్లాజా వాహనాలతో కిక్కిరిసింది. సెలవులు ముగియడంతో శనివారమే కొందరు తమతమ ప్రాంతాలకు వెళ్లినా ఆదివారం మధ్యాహ్నం నుంచి హైవేపై వాహనాల రద్దీ అధికమైంది. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం కొర్లపహాడ్ టోల్‌ప్లాజా ఇరువైపులా వెళ్లే వాహనాలతో కిటకిటలాడింది. ఈ రహదారిపై సాధారణ రోజుల్లో 8-10 వేల వరకు ఇరువైపులా వెళ్తూ ఉంటాయి. ఈ క్రమంలో ఆదివారం ఇరువైపులా కలిపి దాదాపు 15 వేల వాహనాలు వెళ్లినట్లు అంచనా వేస్తున్నారు. విజయవాడ లేన్‌లో వాహనాల రద్దీ కొంత తక్కువగా ఉంది. దీంతో టోల్‌ప్లాజాలోని 12టోల్ కౌంటర్లలో హైదరాబాద్ వైపు వెళ్ళే వాహనాలకు 8 కౌంటర్లు, విజయవాడ వైపుకు వెళ్లే వాహనాలకు 4 కౌంటర్ల చొప్పున కేటాయించి టోల్ ఛార్జీలు వసూలు చేశారు. టోల్ వసూలు కౌంటర్లు సరిపోక వాహనాలు టోల్‌ప్లాజా పరిసరాలు దాటి బారులు తీరాయి. దీంతో టోల్‌ప్లాజాకు కి.మీ. దూరంలోని కొర్లపహాడ్ బస్టాప్ వరకు హైదరాబాద్ లేన్‌లో వాహనాలు నాలుగు వరుసలుగా అడ్డదిడ్డంగా నిలవడంతో ద్విచక్రవాహనదారులకు దారి లేకుండా పోయింది. ట్రాఫిక్ నియంత్రణకు నియమించిన పోలీసులు, టోల్‌ప్లాజా సిబ్బంది వాహనాల క్రమబద్ధీకరణకు తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది.



బీబీనగర్ : గూడూరు టోల్‌ప్లాజా వద్ద హైదరాబాద్ వైపు బారులు తీరిన వాహనాలు

గూడూరు టోల్ ప్లాజా వద్ద వాహనాల బారులు

వరంగల్- హైదరాబాద్ 163 జాతీయ రహదారిపై ఆదివారం కూడా పండుగ రద్దీ కొనసాగింది. యాదాద్రి భువనగిరి జిల్లా పరిధిలోని బీబీనగర్ మండలం గూడూరు టోల్‌ప్లాజా వద్ద వాహనాలు బారులు తీరాయి. మొత్తం 12 టోల్‌గేట్లకు గాను హైదరాబాద్ వైపు 8 గేట్లు, వరంగల్ వైపు 4గేట్లు తెరిచి వాహనాలను పంపిస్తున్నారు. సాధారణ రోజుల్లో 19వేల నుంచి 21వేల వాహనాలు రాకపోకలు కొనసాగిస్తుండగా ఆదివారం 30 వేలకు పైగా వాహనాలు రాకపోకలు కొనసాగించినట్లు టోల్‌ప్లాజా సిబ్బంది తెలిపారు. అర్ధరాత్రి వరకు రద్దీ ఇలాగే ఉండే అవకాశం ఉంది తెలిపారు.

కోదాడ మండలంలో అదే పరిస్థితి

కోదాడ మండలంలోని రామాపురం క్రాస్‌రోడ్డు వద్ద అండర్‌పాస్ బ్రిడ్జి నిర్మాణ పనులు జరుగుతున్నందున ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు గానూ పెద్దఎత్తున బారికేడ్లు ఏర్పాటు చేశారు. దీంతో వాహనాలు పెద్దఎత్తున నిలిచిపోవడంతో పోలీసులు వెంటనే రంగంలోకి దిగి బారికేడ్లను తొలగించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. అలాగే కొమరబండ బైపాస్ వద్ద కూడా హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై వాహనాల రద్దీ పె రగడంతో వాహనాలు నిలిచిపోకుండా బారికేడ్లను తొలగించి వాహనాలను క్రమబద్ధీకరించారు. జాతీయ రహదారిపై వాహనాల రద్దీ పెరిగిపోవడంతో పోలీసులు అప్రమత్తమై వాహనాలకు ఎటువంటి అంతరాయం లేకుండా తగిన చర్యలు చేపట్టినట్లు రూరల్ ఎస్ఐ గోపాల్‌రెడ్డి తెలిపారు.



చిట్యాల మండలం పెద్దకాపర్తిలో జాతీయ రహదారిపై బారులుగా నిలిచిన వాహనాలు

సాగర్‌కు తగ్గిన వరద..గేట్లు మూసివేత

నాగార్జునసాగర్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ప్రాజెక్టు ఎగువనుంచి వరద రాక తగ్గటంతో ప్రాజెక్టు అధికారులు గేట్లు మూసివేశారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు (312.0450 టీఎంసీ) కాగా ఆదివారం సాయంత్రానికి 587.50 అడుగులుగా (305.8030టీఎంసీ) నమోదైంది. సాగర్ నుంచి కుడికాల్వ ద్వారా 10040 క్యూసెక్కులు, ఎడమ కాల్వ ద్వారా 8,896 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వా రా 2,400 క్యూసెక్కులు, వరద కాల్వ ద్వారా 300 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 33,495 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ నుంచి మొత్తం 55,131 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల అవుతుండగా ఎగువనుంచి అంతే మొత్తంలో నీరు సాగర్‌కు వచ్చి చేరుతోంది. క్రస్టుగేట్ల ద్వారా నీటి విడుదలను నిలిపివేశారు.

మూసీకి నిలకడగా ఇన్‌ఫ్లో

కేతేపల్లి : కేతేపల్లి: మూసీ ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో నిలకడగా వస్తుంది. హైదరాబాద్ నగరంతో పాటు ఎగువ మూసీ పరీవాహక ప్రాంతాల్లో రోజుల తరబడి విస్తారంగా కురిసిన వర్షాలకు నిండిన పది రోజుల క్రితం ఉగ్రరూపం దాల్చిన మూసీ క్రమంగా శాంతిస్తూ వచ్చింది. శనివారం సాయంత్రానికి క్యూసెక్కులుగా ఉన్న ఇన్‌ఫ్లో ఆదివారం సాయంత్రానికి కొంతమేర తగ్గి 2248.36క్యూసెక్కులుగా నమోదయ్యింది. మరో రెండు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే వీలుందన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ప్రాజెక్టు నీటిమట్టాన్ని 643.80అడుగులు(4.15టీఎంసీలు) వద్ద నిలకడగా ఉంచుతున్న అధికారులు ఎగువ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లోను ప్రాజెక్టు 8నెంబరు క్రస్టుగేట్లను 2అడుగుల మేర ఎత్తడం ద్వారా 1298.95క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. అలాగే ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వల ఆయకట్టుకు మరో 603క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. 645 అడుగులు(4.46టీఎంసీలు) పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం గల మూసీ ప్రాజెక్టు ప్రస్తుత నీటిమట్టం 643.80అడుగులు(4.15టీఎంసీలు)గా ఉంది.



మూసివేసిన నాగార్జునసాగర్ గేట్లు

స్థానిక సంస్థల ఎన్నికల్లో
సీపీఐ అభ్యర్థులను గెలిపించాలి


సమావేశంలో మాట్లాడుతున్న బూడిద రమేష్

మర్రిగూడ, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఐ అభ్యర్థులను గెలిపించేందుకు కృషి చేయాలని, అదేవిధంగా పార్టీ నిర్ణయం మేరకు కార్యకర్తలు పనిచేయాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు బూడిద సురేష్ అన్నారు. మండలంలోని కొండూరు గ్రామంలో ఆదివారం నిర్వహించిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో ఎంపీటీసీ, జడ్పీటీసీలుగా సీపీఐ అభ్యర్థులను, గ్రామ సర్పంచ్, వార్డు సభ్యులను సీపీఐ మద్దతుదారులను గెలిపించుకోవాలని ఆయన అన్నారు. గ్రామ నాయకుడు ఆకల వెంకట్రాం పటేల్ అధ్యక్షత వహించిన సమావేశంలో సీపీఐ నాయకులు ఆకుల రఘుమయ్య పటేల్, గ్రామ కార్యదర్శి వడ్డేమాన్ వెంకటయ్య, సహాయ కార్యదర్శి జరుపుల రామరాజునాయక్, ఈద మారయ్య, బడేటి పెద్దయ్య, ఉప్పునూతల సత్తయ్య, అంబోతు నవీన్‌నాయక్, మొకురోజు బిక్షపమ్మ, వడ్డేమాన్ రాములు తదితరులు పాల్గొన్నారు.

సమాజ సంఘటితం కోసమే ఆర్‌ఎస్‌ఎస్


ఆర్‌ఎస్‌ఎస్ ర్యాలీలో పాల్గొన్న స్వయం సేవకులు

చిట్యాల, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): సమాజం సంఘటితం కోసం రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ పనిచేస్తుందని సంఘ్ ప్రచారక్ మల్లికార్జున్ అన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా ఆదివారం చిట్యాలలో పదసంచాలన్, సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లికార్జున్ మాట్లాడుతూ హిందూ ధర్మపరిరక్షణకు ఆర్‌ఎస్‌ఎస్ కృషి చేస్తుందన్నారు. పర్యావరణాన్ని కాపాడాలని, స్వదేశీ వస్తువులను వాడాలని కోరారు. దేశ సమగ్రత కోసం అందరూ కలిసి నడవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ సభ్యులు జిట్ట నరేష్, బానుక ఉదయ్, శేఖర్, నరేష్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

వట్టిమర్తిలో ఉచిత కంటి వైద్యశిబిరం

చిట్యాలరూరల్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): చిట్యాల మండలం వట్టిమర్తిలో ఆదివారం 1994-95 10వ తరగతి బ్యాచ్ విద్యార్థుల ఆధ్వర్యంలో కంటి వైద్యశిబిరాన్ని నిర్వహించారు. హైదరాబాద్‌లోని ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి సౌజన్యంతో ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన వైద్యశిబిరంలో గ్రామస్థులు కంటి పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం మందులతో పాటుగా కళ్ల అద్దాలను అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ నర్రా సురేందర్‌రెడ్డి, బూరుగు వెంకన్న, నర్రా భిక్షం, మేడి నర్సింహ, కొమిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, రాచకొండ రఘు తదితరులు పాల్గొన్నారు.

మొదటి విడతలో 318 సర్పంచ్ స్థానాలకు ...

గ్రామపంచాయతీ ఎన్నికలు మొదటివిడత (పోలింగ్‌తేదీ- 31.10.2025)

డివిజన్	జడ్పీటీసీ స్థానం	సర్పంచ్ స్థానాలు	వార్డులు స్టేషన్లు	పురుష ఓటర్లు	మహిళా ఓటర్లు	ఇతరులు	మొత్తం
నల్లగొండ	చిట్యాల	18	180	17,760	17975	0	35,735
నల్లగొండ	కనగల్లు	31	262	18313	18579	0	36892
నల్లగొండ	కట్టంగూరు	22	206	18,565	18,797	0	37362
నల్లగొండ	కేతేపల్లి	16	160	15136	15947	1	31084
నల్లగొండ	నకిరేకల్	17	160	13283	13558	2	26843
నల్లగొండ	నల్లగొండ	31	270	19166	20063	0	39229
నల్లగొండ	నార్కట్‌పల్లి	29	262	21508	22263	1	43772
నల్లగొండ	శాలిగౌరారం	24	230	19937	20448	3	40388
నల్లగొండ	తిప్పర్తి	26	216	13468	14222	0	27690
చండూరు	చండూరు	19	166	12137	12186	0	24323
చండూరు	గట్టుప్పల్	7	68	7832	7785	0	15617
చండూరు	మర్రిగూడ	18	170	15146	15639	0	30785
చండూరు	మునుగోడు	28	244	18990	19048	0	38038
చండూరు	నాంపల్లి	32	276	17886	18524	1	36411
మొత్తం	14	318	2870	2,29,127	2,35,034	8	4,64,169

కంపచెట్లలో విద్యుత్ సబ్‌స్టేషన్

- అధ్వానంగా మారిన వల్లాల సబ్‌స్టేషన్
- వెలగని యార్డ్ లైట్లు
- ఇబ్బందులు పడుతున్న సిబ్బంది, ప్రజలు


వల్లాలలో కంపచెట్ల మధ్య విద్యుత్ సబ్‌స్టేషన్

శాలిగౌరారం, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): విద్యుత్ అధికారు ల నిర్లక్ష్యం వల్ల శాలిగౌరారం మండలం వల్లాల గ్రామంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ కంపచెట్లు, పిచ్చిమొక్కల మధ్య నిర్వ హి స్తున్నారు. దీంతో అటు సిబ్బంది, ఇటు ప్రజలు తీవ్ర ఇబ్బం దు లు పడుతున్నారు. ఈ సబ్‌స్టేషన్ గ్రామానికి అర కిలోమీటరు దూరంలో చెరువుఅన్నారం రోడ్డులో ఉంది. గతేడాది కాలంగా కంపచెట్లలో విద్యుత్ సబ్‌స్టేషన్ ఉంటున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో అందులో పనిచేసే సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. సబ్‌స్టేషన్‌లో దట్టంగా వ్యాపించిన కంపచెట్లతో ఆపరేటర్లు విధులు నిర్వర్తించాలంటే జంకుతున్నారు. పాములు, తేళ్లకు ఈ సబ్‌స్టేషన్ నివాసంగా మారింది. దీంతో రాత్రిపూట సిబ్బంది ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు.

ఈ సబ్‌స్టేషన్‌లో 8 యార్డ్ లైట్లు ఉండగా 2 మాత్రమే వెలుగుతున్నాయి. రాత్రి పూట విద్యుత్ బ్రేక్ డౌన్ అయినా, ఫ్యూజులు కాలిపోయినా సిబ్బంది బయటకు రావాలంటే టార్చి లైట్ పట్టుకొని రావాల్సిన పరిస్థితి. ఇప్పటికైనా సంబంధిత విద్యుత్ అధికారులు మే ల్కొని ఈ సబ్‌స్టేషన్‌లో ఉన్న కంపచెట్లను తొలగించి అన్ని యార్డ్‌లైట్లు వెలిగే విధంగా చర్యలు తీసుకోవాలని వినియోగదారులు, సిబ్బంది కోరుతున్నారు.

ఘనంగా ఎల్లమ్మకు మొక్కుబడి కల్యాణాలు

- ఎల్లమ్మ ఆలయంలో భక్తుల సందడి

కనగల్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దర్వేశిపురం స్టేజీ వద్ద గల శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయంలో భక్తులు మొక్కుబడి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఆలయంలో ఆలయ ముఖ్య అర్చకుడు నాగోజు మల్లాచారి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా భక్తులు అమ్మవారికి చీర సారె, ఒడిబియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఆల య కమిటీ చైర్మన్ చీదేటి వెంకట్‌రెడ్డి, ఈవో అంబటి నాగిరెడ్డి పర్యవేక్షణలో సిబ్బంది తగు ఏర్పాట్లు చేశారు.


అమ్మవారికి మొక్కుబడి కల్యాణంలో పాల్గొన్న భక్తులు

స్థానిక ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను గెలిపించాలి


సమావేశంలో మాట్లాడుతున్న వెంకన్నగౌడ్

శాలిగౌరారం, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థులను అధిక మెజార్టీతో గెలిపించేందుకు నాయకులు సమన్వయంతో కృషి చేయాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు అయితగోని వెంకన్నగౌడ్ అన్నారు. శాలిగౌరారంలో ఆదివారం నిర్వహించిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించాలన్నారు. అన్ని గ్రామల్లో పార్టీని మరింత బలోపేతం చేయడానికి కార్యకర్తలు, నాయకులు సమష్టిగా పనిచేయాలన్నారు. మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ ఆదేశానుసారం శాలిగౌరారం మండల బీఆర్‌ఎస్ జడ్పీటీసీ అభ్యర్థిగా గుజిలాల్ శేఖర్‌బాబును ఎంపిక చేసినట్లు వెంకన్నగౌడ్ తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ మండల మాజీ అధ్యక్షుడు కట్టా వెంకట్‌రెడ్డి, నాయకులు మామిడి సర్వయ్య, గుండా శ్రీనివాస్, గుజలాల్ శేఖర్‌బాబు, కల్లూరి నాగరాజు, మామిడి రమేష్, సుంకరి వీరయ్య, భూపతి ఉపేందర్, నిమ్మల సురేష్, గోదల సురేష్ రడెక్ష, రాపాక రాజు, రాచకొండ గణేష్ వివిధ గ్రామాల అధ్యక్ష, కార్యదర్శులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అలయ్‌బలయ్ తెలంగాణ సంస్కృతికి ప్రతీక


చిట్యాలలో నిర్వహించిన అలయ్‌బలయ్ కార్యక్రమంలో మాట్లాడుతున్న వెంకట్‌రెడ్డి

చిట్యాల, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సంస్కృతికి అలయ్‌బలయ్ ప్రతీక అని మునిసిపల్ మాజీ చైర్మన్ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. చిట్యాల ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో ఆదివారం చిట్యాలలో నిర్వహించిన అలయ్‌బలయ్ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. మన సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకోవడానికి అలయ్‌బలయ్ వేదికగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమ నిర్వాహకులు పోకల దేవదాస్, మారగోని అంజనేయులు, వనమా వెంకటేశ్వర్లు, పొన్నం లక్ష్మయ్య, శ్రీనివాస్, బొబ్బల రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్ -2 ర్యాంకర్‌కు ఘనంగా సన్మానం


శాలిగౌరారం: వల్లాలలో జాల రజితను సన్మానిస్తున్న గ్రామస్థులు

శాలిగౌరారం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఇటీవలన విడుదల చేసిన గ్రూప్-2 ఫలితాల్లో అత్యుత్తమ ర్యాంకు సాధించిన శాలిగౌరారం మండలం వల్లాల గ్రామానికి చెందిన జాల బిక్షం - భద్రమ్మ దంపతుల కుమార్తె జాల రజిత ఎంపీవోగా ఉద్యోగం సాధించింది. ఆదివారం గ్రామంలో గ్రామస్థులు కుటుంబసభ్యులు జాల రజితకు అభినందన, సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వల్లాల గ్రామానికి చెందిన ఉద్యోగులు, మిత్రులు, విద్యావంతులు, గ్రామ పెద్దలు, కుటుంబ సభ్యులు హాజరై ఘనంగా శాలువా కప్పి సన్మానించారు. జాల రజితను ఆమె తల్లిదండ్రులను, భర్త సైదులును అభినందించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ తమ గ్రామానికి చెందిన రజిత ఉన్నత ఉద్యోగం సాధించడం గొప్ప విషయమనిచ, గ్రామానికి ఎంతో గర్వకారణమన్నారు.

కవి బుచ్చిరెడ్డికి సన్మానం


బుచ్చిరెడ్డిని సత్కరిస్తున్న బాలచెలిమి సంపాదకుడు వేదకుమార్

కనగల్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని చినమాదారం హైస్కూల్ ఉపాధ్యాయుడు కవి, రచయిత కోమటిరెడ్డి బుచ్చిరెడ్డిని ఘనంగా సన్మానించారు. హైదరాబాద్‌లో ఆదివారం చిల్డ్రన్స్ అకాడమీ, బాలచెలిమి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో బాలచెలిమి సంపాదకుడు వేదకుమార్, బాలసాహితీ వేత్త డాక్టర్ పత్తిపాక మోహన్ శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండు దశాబ్దాలుగా బాలసాహితీ రంగంలో బుచ్చిరెడ్డి చేస్తున్న సేవలను కొనియాడారు. బాలల కోసం మున్ముందు మరిన్ని రచనలు చేయాలని వారు ఆకాంక్షించారు.

దర్గాను దర్శించుకున్న సుప్రీం కోర్టు న్యాయవాది

ఘనంగా స్వాగతం పలికిన ముతవల్లులు

నల్లగొండ కల్చరల్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని గడియారం సెంటర్‌లోని సయ్యద్ లతీఫుల్లా షాఖాద్రి ఉర్సు ఉత్సవాలు ఈ నెల 9వ తేదీ నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది మిర్జా నిసార్ అహ్మద్ బైగ్, తెలంగాణ హైకోర్టు న్యాయవాది సల్లావుద్దీన్ ఆదివారం ఉదయం దర్గాను దర్శించి ప్రత్యేకంగా ప్రార్థనలు చేశారు.

గుట్ట మెట్ల వద్దకు చేరుకున్న వారికి దర్గా ముతవల్లులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం వారు ఉర్సు ఉత్సవాల ఏర్పాట్ల వసతులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. దర్గా అభివృద్ధికి కృషి చేయాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో హాశం, సమీఉల్లాఖాద్రీ, ఉబైద్‌ఖాద్రీ, సల్మాన్, ముస్లింలు తదితరులు పాల్గొన్నారు.

పత్తి కొనుగోళ్ల ప్రారంభమెప్పుడో?

(3వ పేజీ తరువాయి)

పత్తి సాగు చేశారు. రైతుల నుంచి పత్తి కొనుగోలు చేసేందుకు నల్లగొండ జిల్లాలో 18, యాదాద్రి జిల్లాలో 14, సూర్యాపేట జిల్లాలో 6 జిన్నింగ్ మిల్లుల్లో సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసేందకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.

తక్కువ ధరకు విక్రయించి నష్టపోతున్న రైతులు

ఈ ఏడాది భారీ వర్షాలతో పత్తి చేలు దెబ్బతిన్నా యి. ఇప్పటికే చాలా చోట్ల జాజు రోగం తగిలింది. ప త్తి చేలు ఎదిగే సమయంలో వర్షాలు లేక పంటలో ఎ దుగుదల లోపించింది. పూత, కాత సమయంలో భా రీ వర్షాలు కురిసి భూములు జాలువారి చేలు దెబ్బతిన్నాయి. ఫలితంగా గతంలో ఎకరాకు 10 నుంచి 15 క్వింటాళ్ల దిగుబడి రాగా, ఈ ఏడాది ఐదారు క్వింటా ళ్ల కూడా వస్తుందో లేదోనని రైతులు ఆవేదన చెందుతున్నారు. పొడుగు పింజ పత్తికి ప్రభుత్వ మద్దతు ధర క్వింటాకు రూ.8,110, మధ్య రకం (మీడియం స్టేబుల్) పత్తికి రూ.7,710 ఉంది. సీసీఐ కొనుగోలు కేం ద్రాలు ప్రారంభం కాకపోవడంతో రైతులు తీసిన పత్తిని వెంటనే క్వింటా రూ.5,500 నుంచి రూ.6వేలకు ప్రైవేట్ వ్యాపారులకు విక్రయించి నష్టపోతున్నారు.

సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి



ఈ ఏడాది మొదట్లో వర్షాలు లేక, ఆ తరువాత భారీ వర్షాలు కురిసి పత్తి చేలు దెబ్బతిన్నాయి. గతంతో పోల్చితే పత్తి దిగుబడి సగానికి పడిపోయేలా ఉంది. సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో ప్రభుత్వ మద్దతు ధర క్వింటా రూ.8,110 ఉండగా, ప్రైవేట్ వ్యాపారులు రూ.6వేలకు కొనుగోలు చేస్తున్నారు. ఇటు దిగబడి తగ్గి, అటు ధర లభించక పెట్టుబడులు చేతికి వచ్చేలా లేవు. సంబంధిత ఉన్నతాధికారులు చొరవ తీసుకుని వెంటనే సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి.

- కొండ సోమల్లు, పత్తి రైతు, మోత్కూరు

అ'పూర్వ' సమ్మేళనం

- 20 సంవత్సరాల తర్వాత కలిసిన పూర్వ విద్యార్థులు


పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో పాల్గొన్న అప్పటి విద్యార్థులు

నల్లగొండ, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ఆల్ఫా పబ్లిక్ స్కూల్ 2004-05 సంవత్సరంలో పదవ తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ కరస్పాండెంట్ బాదిని నర్సింహ మాట్లాడుతూ 20 ఏళ్ల తర్వాత పూర్వ విద్యార్థులు ఒకే వేదికపై కలవడం గొప్ప విశేషమన్నారు. పాఠశాలలో చదివిన విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకోవడం ఎంతో అభినందనీయమన్నారు. భవిష్యత్తులో కూడా మరిన్ని ఉన్నత స్థానాలకు ఎదిగి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులను, పూర్వ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవికుమార్, శ్రీనివాస్, లింగయ్య, రమవాణి, నసీన్, శంకరయ్య, రవీందర్, అహ్మద్‌ఆలీ ఖాన్, సురేష్‌రెడ్డి, ప్రసాద్, పూర్వవిద్యార్థుల కమిటీ సభ్యులు సందీప్, ప్రియాంక, ఉష, మహేష్, అనిల్, ఫణి తదితరులు పాల్గొన్నారు.

బస్టాండ్‌లో రద్దీ

హైదరాబాద్ వెళ్లేందుకు విద్యార్థుల పాట్లు



హైదరాబాద్ నాన్‌స్టాప్ స్టేజీ వద్ద బారులుదీరిన విద్యార్థులు



దసరా సెలవులు ఆదివారం ముగియడంతో విద్యార్థులు పట్నం బాట పట్టారు. సోమవారం కళాశాలలు, స్కూళ్లకు వెళ్లేందుకు హైదరాబాద్‌కు వెళ్లేందుకు నల్లగొండ బస్టాండ్‌కు వచ్చారు. దీంతో హైదరాబాద్ నాన్‌స్టాప్ స్టేజీ వద్ద భారీగా క్యూ కట్టారు.

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	587.50 (305.8030)	55,131	55,131
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.80 (4.15)	1,949.30	2,248.36
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	173.226 (43.0610)	97,537	90,774

చికెన్ ధరలు | లైవ్ : రూ.130 | డ్రెస్ : రూ.200 | స్కిన్‌లెస్ : రూ.230



స్థానిక సంస్థల ఎన్నికలకు మూడు రోజుల్లో తొలివిడత నోటిఫికేషన్ విడుదలకు రంగం సిద్ధమవుతున్నా క్షేత్రస్థాయిలో మాత్రం ఉత్కంఠ కొనసాగుతోంది. 42శాతం బీసీ రిజర్వేషన్లను కొట్టివేయాలని కోరుతూ ఇటు హైకోర్టులో 8వ తేదీన విచారణ ఉండగా, తాజాగా సుప్రీంకోర్టులో నమోదైన పిటిషన్ సోమవారం విచారణకు రానుంది. దీంతో కోర్టు తీర్పులపై అంతటా ఉత్కంఠ నెలకొంది.

-(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, నల్లగొండ)



ఉత్కంఠే!

- కోర్టుల విచారణపైనే అందరి దృష్టి
- అభ్యర్థులపై ప్రాథమిక కసరత్తు చేస్తున్న పార్టీలు
- గ్రామాల్లో అంతగా కనిపించని సందడి

స్థానిక సంస్థల ఎన్నికలపై రెండు కోర్టులు ఎలాంటి సూచనలు చేస్తాయనే దానిపైనే అందరి దృష్టి నెలకొంది. అధికార కాంగ్రెస్ సహా అన్ని రాజకీయపార్టీలూ కోర్టు నిర్ణయాల కోసం ఎదురుచూస్తూనే మరో వైపు ఎన్నికలకోసం కార్యాచరణ ప్రారంభించాయి. సోమవారం సుప్రీంకోర్టు ఎలాంటి సూచనలు చేస్తుందో వేచి చూడాల్సి ఉందని, అదేవిధంగా హైకోర్టు బుధవారం ఎలా స్పందిస్తుందనే దానికి అనుగుణంగానే ఎన్నికల నిర్వహణ ఆధారపడి ఉంటుందని అంతా భావిస్తున్నారు. రిజర్వేషన్లపై కోర్టులు ఎలా స్పందించినా, ఎన్నికలు నిర్వహించడం మాత్రం పక్కా అని అధికార వర్గాలు చెబుతున్నాయి. తప్పనిసరి పరిస్థితి ఎదురైతే ప్రభుత్వం ఎన్నికల రిజర్వేషన్లు, షెడ్యూల్‌ను సవరించైనా నిర్వహిస్తుందని చెబుతున్నారు.

అభ్యర్థుల ఎంపికపై మొదలయిన ప్రాథమిక కసరత్తు

సీట్ల వారీగా రిజర్వేషన్లు, ఎన్నికల షెడ్యూల్ విడుదలవడంతో అభ్యర్థుల ఎంపికకు పార్టీలు ప్రాథమిక కసరత్తు ప్రారంభించాయి. అధికార కాంగ్రెస్ పార్టీ ప్రతీ జడ్పీటీసీ స్థానం నుంచి ముగ్గురు పేర్లతో జాబితాను రూపొందిస్తోంది. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, సీనియర్ నేతలు అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా అభ్యర్థులను గుర్తించి అభ్యర్థిత్వం కోసం ఇన్‌చార్జి మంత్రి ద్వారా టీపీసీసీకి సిఫార్సు చేస్తున్నారు. దీంతో అవకాశం కల్పించాలని కోరుతూ టిక్కెట్ ఆశించే నేతలు మంత్రులు, ఎమ్మెల్యేల వద్ద వారి అనుచరులతో కలిసి విజ్ఞాపనలు చేస్తున్నారు. మరోవైపున ఎంపీటీసీ, సర్పంచ్ అభ్యర్థిత్వాలకు సైతం ఎమ్మెల్యేలు సూచించినవారికే ఇవ్వనుండడంతో పేర్లను పరిశీలించాల్సిందిగా ఆశావహులు కోరుతున్నారు. ప్రజల్లో మంచితనం, పార్టీకి విధేయత, గెలుపు అవకాశాలు, ఎన్నికల్లో ఖర్చుపెట్టే సామర్థ్యం ఆధారంగా అభ్యర్థులను ఎంపికచేస్తున్నట్లు కార్యకర్తలు చెబుతున్నారు. ఈనెల 8వ తేదీన జడ్పీటీసీ అభ్యర్థుల జాబితాను పీసీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ అభ్యర్థుల జాబితాలను డీసీసీ ప్రకటిస్తుందని చెబుతున్నారు. పొత్తులు ఖరారైతే ఎక్కడెక్కడ పోటీచేయాలి? ఒంటరిగా పోటీచేయాల్సి వస్తే ఎక్కడ అభ్యర్థులను బరిలో నిలపాలనే ప్రణాళికను సీపీఎం సిద్ధం చేయగా, కాంగ్రెస్, సీపీఎంతో కలిసి ఎన్నికలకు వెళ్లాలని భావిస్తున్న సీపీఐ పోటీచేసే స్థానాలను ఇప్పటికే గుర్తించి సిద్ధం చేసినట్లు తెలిసింది. ప్రతిపక్ష బీఆర్ఎస్ ఇప్పటికే మాజీమంత్రి, మాజీ ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో మండలాల వారీగా కార్యకర్తల సమావేశాలు నిర్వహించి ఎన్నికల్లో పోటీపై మార్గనిర్దేశనం చేశారు. ఎన్నికల్లో అన్ని సీట్లలో పోటీచేసి గెలుపొందాలనే లక్ష్యంతో పార్టీ నేతలు సిద్ధమవుతున్నారు. బీఆర్ఎస్ నుంచి టిక్కెట్ ఆశించే నేతలు ఇప్పటికే మాజీ ఎమ్మెల్యేల వద్ద ప్రయత్నాలు మొదలుపెట్టారు. పార్టీ విస్తరణకు దోహదపడేలా ఈ స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీచేసి సత్తాచాటాలని బీజేపీ చూస్తోంది. గతంలో మాదిరిగా నామమాత్రపు పోటీలకు పరిమితం కావద్దని అధిష్ఠానం గట్టిగా చెబుతుండడంతో స్థానిక నేతలు బలమైన అభ్యర్థుల కోసం అన్వేషణ ప్రారంభించారు. అభ్యర్థుల ఎంపికకోసం త్రీమెన్ కమిటీలను ఏర్పాటు చేయాలని పార్టీ నిర్ణయించింది. ఆశావహులతో పాటు, బలమైన నాయకులను గుర్తించి ఈ కమిటీ అభ్యర్థులను సిఫార్సు చేస్తుందని, ఆ మేరకు అభ్యర్థిత్వాలు ఖరారు చేస్తామని పార్టీ ముఖ్య నేతలు చెబుతున్నారు.

గ్రామాల్లో కనిపించని సందడి

గతానికి భిన్నంగా ప్రస్తుత స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి గ్రామాల్లో ఇంకా సందడి ఆరంభం కాలేదు. ప్రధానంగా కోర్టుల కేసులతో పాటు, రిజర్వేషన్లు తారుమారయ్యే పరిస్థితి ఏర్పడింది. దీంతో గ్రామాల్లో అంతగా సందడి లేదు. అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్‌లో కొన్నేళ్లుగా స్థానిక సంస్థల్లో పోటీచేయాలని భావించి రాజకీయాల్లో కొనసాగుతూ, గ్రామాల్లో సేవాకార్యక్రమాలు, రాజకీయ కార్యక్రమాలు నిర్వహిస్తున్న నాయకులకు రిజర్వేషన్లు ప్రతికూలంగా మారడంతో పరిస్థితి తారుమారైంది. మరోవైపున ద్వితీయ శ్రేణినాయకులుగా చలామణి అవుతూ మండల, నియోజకవర్గస్థాయిల్లో రాజకీయాల్లో క్రియాశీలకంగా ఉన్న నేతలకు సైతం అనుకూలమైన రిజర్వేషన్ల రాకపోవడంతో వారంతా ఒక్కసారిగా స్తబ్దుగా మారారు. రిజర్వేషన్లతో రాజకీయ ఉనికికి దెబ్బతగిలినట్లయిందని, దశాబ్దాల పాటు రాజకీయాల్లో కొనసాగినా చివరకు కీలకమైన పదవికి పోటీపడుతామనే దశలో రిజర్వేషన్లతో ఆశలు వమ్మయ్యాయని సదరు నేతలు వాపోతున్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయాల్లో ఎమ్మెల్యే అభ్యర్థుల కోసం శ్రమించామని, ఆర్థికంగానూ ఎంతో వ్యయం చేసినా చివరికి ఫలితం దక్కే పరిస్థితి లేకుండా పోయిందని వేదన చెందుతున్నారు.

బీఆర్ఎస్ ముందస్తు సమావేశాలు



సూర్యాపేట(కలెక్టరేట్), అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని బీఆర్ఎస్ ముందస్తు సమావేశాలు నిర్వహించింది. సూర్యాపేట నియోజకవర్గంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీ‌శ్‌రెడ్డి నెల క్రితం ఎంపీటీసీల వారీగా ఇన్‌చార్జీలను ఏర్పాటు చేసి క్షేత్రస్థాయిలో సమావేశాలు నిర్వహించారు. మునిసిపాలిటీ పరిధిలోని ముఖ్య నాయకులకు సూర్యాపేట, పెన్‌పహాడ్, చివ్వెంల, ఆత్మకూర్(ఎస్) మండలాల పరిధిలోని ఎంపీటీసీల స్థానాల వారీగా ఇన్‌చార్జీలుగా నియమించారు. వారి ద్వారా స్థానిక నాయకులను సమన్వయం చేసుకుని వారికి కేటాయించిన పరిధిలో గ్రామాలు, తండాల్లో అంతర్గత సమావేశాలు నిర్వహించారు. దీంతో పాటు ఎంపీటీసీ స్థానం పరిధిలో బీఆర్ఎస్ నుంచి పోటీచేసి విజయం సాధించే అభ్యర్థుల పేర్లను కూడా సేకరించారు. తుంగతుర్తి, కోదాడ నియోజకవర్గాల్లో మాజీ ఎమ్మెల్యేలు గాదరి కిశోర్‌కుమార్, బొల్లం మల్లయ్య యాదవ్ మండల స్థాయి పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశాలు నిర్వహించారు. హుజూర్‌నగర్‌లో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు సమావేశాలు నిర్వహించాల్సి ఉంది. ఇదిలా ఉండగా, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పరిపాలనలో వైఫల్యాలపై బీఆర్ఎస్ స్థానిక ఎన్నికల్లో ప్రచారం చేయనుంది. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీల్లో అమలు కానివాటిపై బీఆర్ఎస్ దృష్టి సారించింది. అంతేగాక ఇటీవల యూరియా కొరతతో రైతులు ఎదుర్కొన్న ఇబ్బందులను ప్రచారాస్త్రంగా మలచాలని బీఆర్ఎస్ చూస్తోంది. అదే విధంగా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను గుర్తించి వాటిని ప్రజలకు అర్థమయ్యేలా వివరించి ఎన్నికల్లో లబ్ధిపొందాలని భావిస్తోంది. దీంతో పాటు తుంగతుర్తి, సూర్యాపేట, కోదాడ నియోజకవర్గాలకు గోదావరి జలాలు రాలేదని, కావాలనే కాళేశ్వరం ద్వారా నీటిని సరఫరా చేయలేదనే అంశాలను బీఆర్ఎస్ ప్రచారంలో ప్రస్తావించనుంది.

ప్రభుత్వ సంక్షేమ పాలనపై అధికార పార్టీ ఆశలు

స్థానిక ఎన్నికల్లో విజయం సాధించేందుకు అధికార కాంగ్రెస్ పార్టీ ఎన్నో ఆశలు పెట్టుకుంది. ప్రధానంగా ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ప్రజలకు అందిస్తున్న ప్రజా సంక్షేమ పాలనపై ఆధార పడింది. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ప్రధాన హామీలు అమలు చేసిన విషయాలను ప్రచారంలో ప్రముఖంగా ప్రస్తావించనుంది. రైతులకు రుణమాఫీ, సన్నరకం ధాన్యానికి అదనంగా బోనస్, ఇందిరమ్మ ఇళ్లు, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, 200 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్, సన్నబియ్యం పంపిణీ, నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు, రైతు భరోసా, భూభారతి, తదితర పథకాలను ప్రధాన ప్రచారాస్త్రాలుగా అధికార కాంగ్రెస్ ఎంచుకోనుంది. గత బీఆర్ఎస్ పాలనలో అవినీతి, అక్రమాలు జరిగాయని అధికార పార్టీ నాయకులు ప్రచారంలో ప్రజలకు వివరించి విశ్వాసాన్ని చూరగొనే ప్రయత్నాలు చేయనున్నారు. అదేవిధంగా బీజేపీ సైతం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, ప్రధాని నరేంద్ర మోదీ పాలనను ప్రజలకు వివరించి పార్టీ అభ్యర్థుల విజయానికి సన్నాహాలు చేస్తోంది.

లతీఫుల్లా షాఖాద్రి ఉర్సుకు వేళాయే

- 9 నుంచి ఉత్సవాలు ప్రారంభం
- ముస్తాబైన దర్గా



నల్లగొండ కల్చరల్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని చారిత్రాత్మక హజ్రత్ సయ్యద్ లతీఫుల్లా షాఖాద్రి దర్గా ఉర్సు ఉత్సవాలు ఈ నెల 9న లాంఛనంగా ప్రారంభంకానున్నాయి. ఉర్సు ఉత్సవాలకు రాష్ట్రంలోని నలుమూలల ప్రాంతాల నుంచేగాక, ఏపీ, కర్నాటక, మహారాష్ట్ర నుంచి కూడా భక్తులు హాజరవుతారు. అధికారికంగా మూడు రోజులే ఈ ఉర్సు ఉత్సవాలు నిర్వహిస్తుండగా, ఆ తరువాత నెల రోజుల పాటు సాగనున్నాయి. ఇప్పటికే గుట్టమెట్ల ప్రాంతంలో వివిధ రకాల దుకాణాలు ఏర్పాటయ్యాయి. దర్గా ప్రాంతమంతా విద్యుత్ దీపాలతో అలంకరించి రంగులు వేసి ముస్తాబు చేశారు. దీంతో ఈ ప్రాంతంలో ఆధ్యాత్మిక, ఆహ్లాదకర వాతావరణం నెలకొంది. ఈనెల 9న సాయంత్రం 5.30 గంటలకు స్థానిక మదీనా మసీదులో గంధానికి ప్రార్థనలు నిర్వహించిన అనంతరం పట్టణంలో ఊరేగింపు నిర్వహిస్తారు. ఇక్కడి నుంచి గంధం ఊరేగింపు రాత్రికి గుట్ట మెట్ల వద్దకు చేరుకున్న అనంతరం ఉర్సు ఉత్సవాలు ప్రారంభం అవుతాయి. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కలెక్టర్ ఇలా ఎస్పీ శతర్‌చంద్రపవార్, వివిధ పార్టీ నాయకులు, ఇతర ప్రజాప్రతినిధులు హాజరై గంధానికి స్వాగతం పలికి ఉర్సు ఉత్సవాలను లాంఛనంగా ప్రారంభిస్తారని దర్గా ముతవల్లులు సయ్యద్ సమిఉల్లా ఖాద్రి, సల్మాన్ ఖాద్రీ తెలిపారు. 10వ తేదీన దర్గాలో దీపారాధన, నిరంతరం భక్తులకు అన్నదానం, పాత కలెక్టరేట్ మసీదులో ఖురాన్ పఠనం, ప్రముఖుల సందేశాలు ఉంటాయి. 11నరాత్రి గుట్టమెట్ల వద్ద కళాకారుల ఖవ్వాలి ఉంటుంది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు జరగకుండా తాగు నీరు, ఇతర వసతులు కల్పించారు. నెల రోజులపాటు కొనసాగే ఈ ఉర్సు ఉత్సవాల్లో ముస్లింలతోపాటు హిందువులు అధిక సంఖ్య పాల్గొని ప్రత్యేక ప్రార్థనలకు హాజరవుతారు. ఇదిలా ఉండగా, దర్గా వద్దకు ఘాట్ రోడ్డు పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఉన్నతాధికారుల సమన్వయంతో ఉర్సు ఉత్సవాల ఏర్పాట్లు, భక్తులకు వసతుల కల్పన పనులు కొనసాగుతున్నాయి.

పత్తి కొనుగోళ్ల ప్రారంభమెప్పుడో?

ఉమ్మడి జిల్లాలో పత్తి దిగుబడుల రాక ప్రారంభమైంది. ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధరకు పత్తి కొనుగోలుకు కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) సిద్ధమైనా, సీసీఐ నిబంధనలను జిన్నింగ్ మిల్లుల యజమానులు వ్యతిరేకిస్తున్నారు. ఈ నేపథ్యంలో సీసీఐ, మార్కెటింగ్‌శాఖ, కలెక్టర్లు సమన్వయంతో పత్తి కొనుగోళ్లకు సన్నాహాలు చేస్తున్నారు.

- (ఆంధ్రజ్యోతి,మోత్కూరు)



- సీసీఐ నిబంధనలను వ్యతిరేకిస్తున్న జిన్నింగ్ మిల్లుల యజమానులు
- టెండర్ దాఖలుకు ఆసక్తి చూపని మిల్లు యజమానులు
- ప్రైవేట్ వ్యాపారులకు తక్కువ ధరకు విక్రయిస్తున్న రైతులు
- 'కపాస్ కిసాన్' యాప్‌తో అక్రమాలకు చెక్

కేంద్ర ప్రభుత్వం నూతనంగా 'కపాస్ కిసాన్' యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఈ యాప్‌లో స్లాట్ బుకింగ్ ద్వారా పత్తి విక్రయానికి ఒక్కోప్రాంతం వారికి ఒక్కో మిల్లు కేటాయించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. దేశంలో కొన్నిరాష్ట్రాల్లో ఇప్పటికే పత్తి కొనుగోళ్లకు టెండర్లు పూర్తికాగా, రాష్ట్రంలో మాత్రం కఠిన నిబంధనలతో జిన్నింగ్ మిల్లులు విముఖత చూపుతున్నట్టు సమాచారం. దీనిపై సీసీఐ అధికారులు, జిన్నింగ్ మిల్లుల యజమానులతో ఈ నెల 6న సమావేశం కానున్నారు. ఈ సమావేశంలో విధి విధానాలు ఖరారయ్యే అవకాశం ఉంది.

కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో జాప్యం

రాష్ట్ర వ్యాప్తంగా ఈ ఏడాది అధిక వర్షాలు కురిసి పత్తి చేలు దెబ్బతిన్నాయి. ఇప్పటికీ అడపాదడపా వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. వర్షాల కారణంగా పత్తి నాణ్యత దెబ్బతిన్నది. పత్తిలో తేమ ఎక్కువగా ఉంటోందని, రంగుమారి వస్తోందని, ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరకు కొనుగోలు చేస్తే నష్టపోతామని జిన్నింగ్ మిల్లుల యజమానులు సీసీఐతో ఒప్పందం కుదుర్చుకోవడంలో జాప్యం చేస్తున్నట్టు తెలుస్తోంది. దీనికి తోడు పత్తి కొనుగోలుకు ఎల్-1, ఎల్-2, ఎల్-3 విధానాన్ని ఎత్తి వేయాలని జిన్నింగ్ మిల్లుల యజమానులు డిమాండ్ చేస్తున్నారు. సీసీఐ గతంలో నెలకోసారి ఓటీ (పత్తి శాతం), గింజల శాతం పెంచగా ఈ సారి ప్రతీ 15 రోజులకు ఓ సారి పత్తి, గింజల శాతం పెంచాలనే నిబంధనను మిల్లర్లు అంగీకరించడం లేదు. 'కపాస్ కిసాన్' యాప్ ద్వారా స్లాట్ బుకింగ్ విధానాన్ని కూడా వ్యతిరేకిస్తున్నారు. వీటితో పాటు ఇతర సమస్యలపై చర్చించాకే టెండర్లు వేయాలని భావనలో జిన్నింగ్ మిల్లుల యజమానులు ఉన్నారు.

యాప్‌తో అక్రమాలకు చెక్

పత్తి కొనుగోళ్లలో అక్రమాలకు చెక్ పెట్టేందుకు సీసీఐ 'కపాస్ కిసాన్' యాప్‌ను రూపొందించింది. ఈ యాప్‌లో పంట నమోదు చేసుకున్న రైతుల నుంచే సీసీఐ పత్తి కొనుగోలు చేస్తుంది. రైతులు స్లాట్ బుక్ చేసుకుని విక్రయించాలి. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఇప్పటి వరకు రైతులు ఆ యాప్‌లో పత్తి పంట విస్తీర్ణాన్ని నమోదు చేసుకోలేదు. ఏఈఓలు నమోదు చేసిన పంట విస్తీర్ణాన్ని (క్రాప్ బుకింగ్)వారి ద్వారానే 'కపాస్ కిసాన్' యాప్‌లో అప్‌లోడ్ చేయిస్తామని వ్యవసాయశాఖ జిల్లా అధికారులు చెబుతున్నారు. ఈ నెల రెండో వారంలో యాప్‌లో పత్తి పంట నమోదుపై ఏఈఓలకు శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిసింది. యాప్‌లో రైతు ఆధార్ కార్డు, పట్టాదారు పాస్‌పుస్తకం, బ్యాంక్ ఖాతా అనుసంధానం చేస్తారు. కౌలు రైతులు ఓటీపీ ద్వారా యాప్‌లో రిజిస్టర్ చేసుకోవచ్చు. డిజిటలైజేషన్‌తో పారదర్శకంగా పత్తి కొనుగోళ్లు, చెల్లింపు జరుగుతాయని అధికారులు చెబుతుండగా, ఈ నిబంధనలు కొనుగోళ్లకు అడ్డంకిగా మారుతాయని జిన్నింగ్ మిల్లుల యజమానులు ఆరోపిస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో 7.46లక్షల ఎకరాల్లో పత్తి సాగు

యాదాద్రి జిల్లాలో 1,07,710 ఎకరాల్లో, నల్లగొండ జిల్లాలో 5,47,735 ఎకరాల్లో, సూర్యాపేట జిల్లాలో 91వేల ఎకరాల్లో రైతులు

- మిగతా 6వ పేజీలో...

'ప్రజావాణి', పోలీస్ గ్రీవెన్స్‌డే రద్దు

నల్లగొండ, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): జడ్పీటీసీ, ఎంపీటీసీ, గ్రామపంచాయతీ ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉన్న దృష్ట్యా ప్రతీ సోమవారం నిర్వహించే 'ప్రజావాణి' కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ ఇలా త్రిపాఠి, పోలీస్ గ్రీవెన్స్‌డే రద్దు చేస్తున్నట్టు ఎస్పీ శరత్ చంద్రపవార్ ఆదివారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి ముగిసిన తరువాత యథావిధిగా 'ప్రజావాణి', పోలీస్ గ్రీవెన్స్‌డే ఉంటుందన్నారు. జిల్లా ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని వారు కోరారు.

హిందూ సంఘటన్‌తో దేశానికి రక్షణ

ఆర్ఎస్ఎస్ విభాగ్ సంఘ చాలక్ వెంకటయ్య



నల్లగొండలో ర్యాలీ నిర్వహిస్తున్న స్వయం సేవకులు

నల్లగొండ, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): హిందూ సంఘటన్ ద్వారానే దేశం రక్షణ సాధ్యమని, హిందువుల ఐక్యతకు పంచ పరివర్తన్ ద్వారా ఆర్ఎస్ఎస్ కృషి చేస్తోందని ఆర్ఎస్ఎస్ నల్లగొండ విభాగ్ సంఘ చాలక్ గార్లపాటి వెంకటయ్య అన్నారు. ఆర్ఎస్ఎస్ 100 ఏళ్ల స్థాపన ఉత్సవాల్లో భాగంగా ఆదివారం జిల్లా కేంద్రంలో నల్లగొండ నగరశాఖ ఆధ్వర్యంలో మేకల అభినవ్ స్టేడియం నుంచి ఎన్జీ కళాశాల వరకు స్వయం సేవకులు పద సంచలన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 1925లో ప్రారంభమై ప్రస్తుతం దేశ వ్యాప్తంగా విస్తృత శాఖలతో విభిన్న రంగాల్లో ఆర్ఎస్ఎస్ పనిచేస్తోందన్నారు. హిందువుల్లో ఐక్యతను సంఘం పెంపొందిస్తోందన్నారు. హిందుత్వ జీవన విధానం విశ్వ శాంతికి ఆధారమని, ప్రపంచంలోని వివిధ మతాలను సమన్వయపర్చే సనాతన జీవన విలువలు హిందుత్వంలో ఉన్నాయన్నారు. దేశ అభివృద్ధి కోసం, పంచ పరివర్తన కోసం హిందువులు పాటుపడాలని అన్నారు. కుటుంబ జీవన విలువలు, పర్యావరణ పరిరక్షణ, పౌర విధులను ప్రతీ ఒక్క కుటుంబం ఆచరించాలన్నారు. ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా జన జాగరణ చేపట్టనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో విభాగ్ సాహ సంఘ చాలక్ ఇటికాల కృష్ణయ్య, నగర సంఘ చాలక్ దోసపాటి శ్రీనివాస్, విభాగ్ ప్రచారక్ కాసం సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రజల కోసం పనిచేసే వారిని నిలపాలి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి

మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి

నల్లగొండ, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రజల కోసం, పార్టీ కోసం నమ్మకంగా పనిచేసే సమర్థ వ్యక్తులను పార్టీ అభ్యర్థులుగా సూచించాలని మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో తిప్పర్తి మండల స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో కొన్ని పొరపాట్లు జరిగిన మాట వాస్తవమేనని, వారిని నమ్మి పార్టీని చేతుల్లో పెడితే తీరా అసెంబ్లీ ఎన్నికల సమయంలో వెన్నుపోటు పొడిచి ద్రోహం చేశారన్నారు. ఈసారి అలా మోసపోకుండా పార్టీకి నమ్మకమైన వ్యక్తులను అభ్యర్థులుగా గుర్తించాలన్నారు. అంతేగాక వారి గెలుపునకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు కటికం సత్తయ్యగౌడ్, మందడి సైదిరెడ్డి, తండు సైదులుగౌడ్, పల్‌రెడ్డి రవీందర్‌రెడ్డి, లోడంగి గోవర్ధన్, సందీప్‌రెడ్డి, నర్సింహ, లక్ష్మయ్య, జ్యోతి, స్వరూప, నాగేశ్వర్‌రావు, సైదులు, విజయ, కొమ్ము గిరి, తదితరులు పాల్గొన్నారు.

పయనం జర పైలం

- ప్రమాదకరంగా మూలమలుపులు
- కనిపించని హెచ్చరిక బోర్డులు
- పట్టించుకోని అధికారులు



చింతపల్లి, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ - హైదరాబాద్ ప్రధాన రాష్ట్ర రహదారి నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా మారుతోంది. ప్రస్తుతం దసరా పండుగ నేపథ్యంలో పట్టణాల నుంచి ప్రజలు తమ సొంత గ్రామాలకు వచ్చారు. పండుగ ప్రశాంతంగా ముగించుకొని తిరిగి పట్టణాలకు బయలుదేరారు. సాగర్ హైవేపై కల్వర్టులు ప్రమాదకరంగా మారిన మూలమలుపులు ఉండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ప్రమాదకరంగా మారిన ప్రాంతాల్లో అధికారులు ఎలాంటి సూచిక బోర్డులు, హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయలేదు. జాతీయ రహదారిపై వెళ్లే వాహనదారులు నిబంధనలు పాటించకపోవడం, అవగాహన లేకుండా ప్రయాణం చేస్తుండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. సాగర్-హైదరాబాద్ ప్రధాన రహదారి 35 కిలోమీటర్ల దూరంలో వ్యాపించి ఉంది. హైవేపై ప్రయాణించే వాహనదారులు అతివేగంతో వాహనాలను నడపడం ప్రమాదాలకు కారణమవుతుంది. అధికారులు ప్రమాదాల రిజిస్టర్‌లో నమోదు చేస్తున్నా ప్రమాదాల నివారణకు తగిన చర్యలు తీసుకోవడం లేదని పలు విమర్శలు వినిపిస్తున్నాయి.

ప్రమాదాలు జరిగే ప్రాంతాలు ఇవే

- మదనాపురం గేట్ నుంచి రంగారెడ్డి జిల్లా మాడ్గుల్ మండల కేంద్రానికి వెళ్లే ప్రాంతంలో వాహనాలు ప్రమాదవశాత్తు అదుపు తప్పుతున్నాయి.
- ప్రశాంతిపురి తండా, కుర్మేడ్ గేట్, విరాట్‌నగర్ కాలనీతో పాటు ధైర్యపురితండా, వింజమూర్, చింతపల్లి నసర్లపల్లి గ్రామాల సమీపంలో అత్యంత ప్రమాదకరంగా మూల మలుపులు ఉన్నాయి.
- గాసీరాంతండా, దేన్య లక్ష్మణ్‌నాయక్ తండాల సమీపంలో మూలమలుపు భయంకరంగా మారాయి.
- కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని శేరిపల్లి చెన్నారం, పెద్దఅడిశర్లపల్లి మండలంలోని పలు ప్రాంతాల్లో రోడ్డు ఎంతో ప్రమాదకరంగా తయారయ్యాయి.

ఇటీవల ప్రమాదాల్లో ఐదుగురు మృత్యువాత

దసరా పండుగ సందర్భంగా దేవరకొండ మండలంలోని మట్టిక తండాకు చెందిన రత్లావత్ వినోద్, రత్లావత్ భాస్కర్, సభావట్ రవి ముగ్గురు చింతపల్లికి వచ్చారు. తిరిగి వెళ్తుండగా నసర్లపల్లిగేట్ సమీపంలో ఆటో అదుపు తప్పి కారు ఆటో ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో ముగ్గురు యువకులు దుర్మరణం చెందారు. డీసీఎం కారు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు ముస్లింలు మృత్యువాత పడ్డారు.

సూచిక బోర్డులు ఏర్పాటు చేస్తాం

సాగర్-హైదరాబాద్‌పై ప్రమాదాలు జరగకుండా వెంటనే సూచిక, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటా. మూలమలుపుల వద్ద వేగ నియంత్రికలు ఏర్పాటు చేయాలని సిబ్బందిని ఆదేశిస్తా.

\- ప్రభాకర్ అర్అండ్‌బీ ఈఈ, దేవరకొండ

ఇలా చేస్తే ప్రమాదాల నివారణ

- సాగర్-హైదరాబాద్ మూల మలుపుల వద్ద ప్రమాదాల నివారణకు సంబంధించి సూచికబోర్డులు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి.
- హైవేపై రద్దీగా ఉన్న ప్రాంతాలను గుర్తించి రహదారిపై వేగ నియంత్రిక అడ్డ కట్టలను ఏర్పాటు చేయాలి.
- రాత్రి సమయంలో హైవే సమీపంలో రెడ్‌లైట్లు ఏర్పాటు చేయాలి.
- హైవేపై వెళ్తున్న వాహనదారులను తనిఖీ చేయాలి.
- మద్యం తాగి వాహనాలు నడిపే వారి లైసెన్స్ వెంటనే రద్దు చేయాలి.
- ఇలాంటి చర్యలు అధికారులు తీసుకున్నట్లయితే కొంతవరకు ప్రమాదాలను నివారించే అవకాశం ఉంటుంది.

స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటాలి

● మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు



బీఆర్ఎస్ ముఖ్యకార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు

మాడ్గులపల్లి, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీ ఆర్ఎస్ పార్టీ అన్ని స్థానాలను కైవసం చేసుకోవాలని మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు అన్నారు. మండలంలోని ఇందుగుల గ్రామంలో ఆదివారం నిర్వహించిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశానికి హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయలేదని విమర్శించారు. ప్రజలు రెండేళ్లకే కాంగ్రెస్ ప్రభుత్వంపై విరక్తి చెందారని అన్నారు. మండలం మూడు నియోజకవర్గాల పరిధిలో ఉన్నా ఎంపీపీ, జడ్పీటీసీ స్థానాలను బీఆర్ఎస్ అభ్యర్థులు గెలిచే విధంగా ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యేలు లక్ష్మారెడ్డి, జైవీర్‌రెడ్డి గెలిచిన తర్వాత నియోజకవర్గా న్ని గాలికి వదిలేశారని, వారు చేసిన అభివృద్ధి శూన్యమని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ 420 హామీలపై ప్రజలకు అవగాహన కల్పించి స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాలను బీఆర్ఎస్ కైవసం చేసుకునేలా కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు నోముల భగత్, కంచర్ల భూపాల్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు పాలుట్ల బాబయ్య, జిల్లా కోఆప్షన్ మాజీ సభ్యుడు మోసిన్‌అలీ, నాయకులు నిమ్మల నవీన్‌రెడ్డి, వివేక్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, వెన్న శ్రవణ్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, పోకల రాజు, ఇంద్రారెడ్డి, పగిళ్ల సైదులు, జెర్రిపోతుల రాములుగౌడ్, చింతరెడ్డి యాదగిరిరెడ్డి, సింగం శివ, సైదులు తదితరులు పాల్గొన్నారు.

పత్తి కొనుగోళ్ల ప్రారంభమెప్పుడో?

(3వ పేజీ తరువాయి)

పత్తి సాగు చేశారు. రైతుల నుంచి పత్తి కొనుగోలు చేసేందుకు నల్లగొండ జిల్లాలో 18, యాదాద్రి జిల్లాలో 14, సూర్యాపేట జిల్లాలో 6 జిన్నింగ్ మిల్లుల్లో సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.

తక్కువ ధరకు విక్రయించి నష్టపోతున్న రైతులు

ఈ ఏడాది భారీ వర్షాలతో పత్తి చేలు దెబ్బతిన్నాయి. ఇప్పటికే చాలా చోట్ల జాజు రోగం తగిలింది. పత్తి చేలు ఎదిగే సమయంలో వర్షాలు లేక పంటలో ఎదుగుదల లోపించింది. పూత, కాత సమయంలో భారీ వర్షాలు కురిసి భూములు జాలువారి చేలు దెబ్బతిన్నాయి. ఫలితంగా గతంలో ఎకరాకు 10 నుంచి 15 క్వింటాళ్ల దిగుబడి రాగా, ఈ ఏడాది ఐదారు క్వింటాళ్లు కూడా వస్తుందో లేదోనని రైతులు ఆవేదన చెందుతున్నారు. పొడుగు పింజ పత్తికి ప్రభుత్వ మద్దతు ధర క్వింటాకు రూ.8,110, మధ్య రకం (మీడియం స్టేబుల్) పత్తికి రూ.7,710 ఉంది. సీసీఐ కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాకపోవడంతో రైతులు తీసిన పత్తిని వెంటనే క్వింటా రూ.5,500 నుంచి రూ.6వేలకు ప్రైవేట్ వ్యాపారులకు విక్రయించి నష్టపోతున్నారు.

సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి



ఈ ఏడాది మొదట్లో వర్షాలు లేక, ఆ తరువాత భారీ వర్షాలు కురిసి పత్తి చేలు దెబ్బతిన్నాయి. గతంతో పోల్చితే పత్తి దిగుబడి సగానికి పడిపోయేలా ఉంది. సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో ప్రభుత్వ మద్దతు ధర క్వింటా రూ.8,110 ఉండగా, ప్రైవేట్ వ్యాపారులు రూ.6వేలకు కొనుగోలు చేస్తున్నారు. ఇటు దిగుబడి తగ్గి, అటు ధర లభించక పెట్టుబడులు చేతికి వచ్చేలా లేవు. సంబంధిత ఉన్నతాధికారులు చొరవ తీసుకుని వెంటనే సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి.

\- కొండ సోమల్లు, పత్తి రైతు, మోత్కూరు

కాకా నిరుపేదల దేవుడు

● ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి



కాకా విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ టౌన్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): గడ్డం వెంకటస్వామి (కాకా) నిరుపేదల దేవుడని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. గడ్డం వెంకటస్వామి జయంతి సందర్భంగా ఆదివారం ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మాట్లాడుతూ కార్మిక ఉద్యమాల్లో చురుకైన పాత్ర పోషించిన కాకా పేదలకు బస్తీల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారని గుర్తు చేశారు. ఆయన అడుగుజాడల్లో కార్యకర్తలు పయనించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సోషల్ వర్కర్ డాక్టర్ జాడి రాజు, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి నారాయణ, బీఎల్ఆర్ బ్రదర్స్, నాయకులు పాల్గొన్నారు.

మిల్లర్ల సమస్యల పరిష్కారానికి కృషి

వేములపల్లి, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): మిల్లర్స్ సమస్యల పరిష్కారానికి తమవంతుగా కృషి చేస్తామని రైస్ మిల్లర్స్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కర్నాటి రమేష్ అన్నారు. రైస్ మిల్లర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని మండలంలోని శెట్టిపాలెం గ్రామ శివారులో గల దాక్షాయని ఫుడ్ ప్రొడక్షన్ యాజమాన్యం ఆధ్వర్యంలో ఆదివారం శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రైస్ మిల్లర్స్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కర్నాటి రమేష్ నూతన బాధ్యతలు స్వీకరించిన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నూతన అధ్యక్షుడు గౌరు శ్రీను, కార్యదర్శి బోగవెల్లి వెంకటరమణ చౌదరి, ఉపాధ్యక్షుడు గోళ్ల రామశేఖర్, కోశాధికారి బండెం రాము, పొలిశెట్టి ధనుంజయ్, దాక్షాయని ఫుడ్ ప్రొడక్షన్ యాజమాన్యం జేవీ రమణ, చల్మారెడ్డి, తిరుపతిరావు, గోపి, సురేందర్, రవి, రాంబాబు పాల్గొన్నారు.

రెండో విడతలో 282 సర్పంచ్ స్థానాలకు..

రెండోవిడత గ్రామపంచాయతీలు (పోలింగ్‌తేదీ -4.11.2025)

డివిజన్	జడ్పీటీసీ స్థానం	సర్పంచ్ స్థానాలు	వార్డులు స్టేషన్లు	పురుష ఓటర్లు	మహిళా ఓటర్లు	ఇతరు	మొత్తం
మిర్యాలగూడ	అడవిదేవులపల్లి	13	108	7340	7334	0	14674
మిర్యాలగూడ	అనుముల	24	202	11588	12207	1	23796
మిర్యాలగూడ	దామరచర్ల	35	302	20179	20732	3	40914
మిర్యాలగూడ	మాడుగులపల్లి	28	238	14837	15686	0	30523
మిర్యాలగూడ	మిర్యాలగూడ	46	394	27130	28042	8	55180
మిర్యాలగూడ	నిడమనూరు	29	256	17516	18577	1	36094
మిర్యాలగూడ	పెద్దవూర	28	244	16921	17564	9	34494
మిర్యాలగూడ	తిరుమలగిరిసాగర్	35	288	17381	17690	4	35075
మిర్యాలగూడ	త్రిపురారం	32	270	17963	18732	3	36698
మిర్యాలగూడ	వేములపల్లి	12	116	9966	10602	0	20568
మొత్తం	10	282	2418	1,60,821	1,67,166	29	3,28,016

మూడో విడత గ్రామపంచాయతీలు (పోలింగ్‌తేదీ- 8.11.2025)

డివిజన్	జడ్పీటీసీ స్థానం	సర్పంచ్ స్థానాలు	వార్డులు స్టేషన్లు	పురుష ఓటర్లు	మహిళా ఓటర్లు	ఇతరు	మొత్తం
దేవరకొండ	చందంపేట	30	250	15768	14910	1	30679
దేవరకొండ	చింతపల్లి	36	294	22418	22633	3	45054
దేవరకొండ	దేవరకొండ	41	316	17909	17806	1	35716
దేవరకొండ	గుడిపల్లి	12	104	6066	6205	0	12271
దేవరకొండ	డిండి	39	326	20660	20863	2	41525
దేవరకొండ	గుర్రంపోడు	38	314	18947	19623	1	38571
దేవరకొండ	కొండమల్లేపల్లి	27	216	14992	14604	3	29599
దేవరకొండ	నేరేడుగొమ్ము	21	170	10304	9955	3	20262
దేవరకొండ	పిఏపల్లి	25	216	13848	13790	6	27644
మొత్తం	9	269	2206	1,40,912	1,40,389	20	2,81,329

న్యూస్ బాక్స్

ప్రభుత్వ, వక్ఫ్‌బోర్డు భూముల్లో అక్రమ నిర్మాణాలు చేపడితే కఠినచర్యలు

● తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి

దేవరకొండ, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): దేవరకొండ పట్టణంలోని ప్రభుత్వ, వక్ఫ్ బోర్డు భూముల్లో నిబంధనలకు విరుద్ధంగా అక్రమ నిర్మాణాలు చేపడితే కేసులు నమోదు చేసి కఠినచర్యలు తీసుకుంటామని తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి హెచ్చరించారు. దేవరకొండలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేవరకొండ పట్టణంలోని 753 సర్వే నెంబర్‌తో పాటు పలు ప్రాంతాల్లో వక్ఫ్ బోర్డు భూములను కబ్జా చేసుకొని అక్రమ నిర్మాణాలు చేపడుతున్నట్లు ఫిర్యాదులు అందాయని తెలిపారు. విచారణ జరిపి ప్రభుత్వ భూముల్లో అక్రమ కట్టడాలు నిర్మిస్తే కూల్చివేస్తామని, బాధ్యులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సోమవారం జిల్లా వక్ఫ్ బోర్డు అధికారులు దేవరకొండలో విచారణ చేపట్టనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఉన్నత విద్యను పేదరికం అడ్డుకోవద్దు

● ఎమ్మెల్సీ శంకర్‌నాయక్

దామరచర్ల, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ఉన్నత చదువుకు పేదరికం అడ్డు రాకూడదని ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్ అన్నారు. మండలంలోని వీర్లపాలెం గ్రామానికి చెందిన పానుగోతు ధనలక్ష్మీ ఎస్ఐటీ పాండిచ్చేరిలో చదవడానికి విశ్రాంత హెచ్ఎం కొత్త రాఘవేంద్రప్రసాద్ సంవత్సరానికి రూ.15వేలు ఆర్థికసాయం అందజేస్తున్నారు. ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ధనలక్ష్మీకి రాఘవేంద్రప్రసాద్ అందజేసిన ఆర్థికసాయాన్ని ఎమ్మెల్సీ శంకర్‌నాయక్ అందజేసి మాట్లాడారు. ఉపాధ్యాయ వృత్తిలో సుదీర్ఘకాలం పనిచేసి ఉద్యోగ విరమణ అనతరం పేద విద్యార్థులను గుర్తించి వారికి ఆర్థికచేయూత అందించడం గొప్ప విషయమన్నారు. మున్ముందు కూడా రాఘవేంద్రప్రసాద్ ఇలాంటి మరిన్ని సేవలు చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ ముదిరెడ్డి నర్సిరెడ్డి, నాయకులు కొండా లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

దేవరకొండలో వర్షం

● పత్తి రైతుల్లో ఆందోళన

దేవరకొండ, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): దేవరకొండలో ఆదివారం చిరుజల్లులతో కూడిన వర్షం కురిసింది. దేవరకొండ పట్టణంతోపాటు మండలంలోని గ్రామాల్లో వర్షం కురుస్తుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆదివారం సాయంత్రం చిరు జల్లులతో కూడిన వర్షం కురియడంతో వాతావరణం చల్లబడింది. పత్తి పంట చేతికి వచ్చి ఏరుతున్న రైతులు వర్షం కురుస్తుండడంతో ఆందోళన చెందుతున్నారు.

బీసీ రిజర్వేషన్లను అడ్డుకోవడం సరికాదు

● బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్

మిర్యాలగూడటౌన్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్లు అడ్డుకోవాలని చూడటం సిగ్గుచేటని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ అన్నారు. పట్టణంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర జనాభాలో సుమారు 60 శాతం ఉన్న బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కల్పనకు చర్యలు జరుగుతుండగా, కొందరు వ్యతిరేకులు అడ్డుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వారు బీసీ రిజర్వేషన్లపై అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించడం బాధ కలిగించిందన్నారు. దశాబ్దాల కాలంగా బీసీల వాటా పదవులను అనుభవించారని, ఇప్పుడు బీసీలకు వచ్చిన అవకాశాన్ని అడ్డుకోవాలని చూస్తున్నారని ఆరోపించారు. రిజర్వేషన్ వ్యతిరేకులను బీసీ సమాజం క్షమించదని, తరిమికొడుతుందని ఆయన హెచ్చరించారు.

టీచర్ల కొరత లేదు

● ఎంఈవో శ్రీనివాస్

తిరుమలగిరి(సాగర్), అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల ఖాళీలను సర్దుబాటు చేయడంలో నిర్లక్ష్యం చేస్తున్నారనే ఆరోపణలు అవాస్తవమని ఎంఈవో కె.శ్రీనివాస్ ఆదివారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. విద్యాశాఖ ఆదేశాల మేరకు అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో సబ్జెక్టులకు అనుగుణంగా ఖాళీలను సర్దుబాటు చేశామని పేర్కొన్నారు. అయితే ఉపాధ్యాయుల పదోన్నతుల తర్వాత రెండు పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఉందని, వాటిని జిల్లా విద్యాశాఖ ఆదేశాల మేరకు సర్దుబాటు చేసినట్లు తెలిపారు. తనను ఇబ్బందులను గురిచేయాలనే ఉద్దేశ్యంతో కొందరు ఉపాధ్యాయ సంఘం నాయకులు ఆరోపణలు చేస్తున్నారని, ఇది సరైన విధానం కాదని ఆయన పేర్కొన్నారు.

బీజేపీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ధీరావత్ మేష్యానాయక్

దామరచర్ల, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో మండలంలో బీజేపీ అభ్యర్థుల గెలుపు కోసం కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు ధీరావత్ మేష్యానాయక్ అన్నారు. మండలంలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ఎంపిక కోసం ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలని ఆయన కోరారు. బీజేపీ అభ్యర్థుల గెలుపు కోసం కార్యకర్తలు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సజ్జల నాగిరెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కనపర్తి సత్యప్రసాద్, నాయకులు అశోక్‌రెడ్డి, జానకిరాంరెడ్డి, ఈగ సైదారావు తదితరులు పాల్గొన్నారు.

హిందువులు సంఘటితం కావాలి



కొండమల్లేపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు

కొండమల్లేపల్లి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): హిందువులంతా సంఘటితం కావాలని ఆర్ఎస్ఎస్ తెలంగాణ ప్రాంత కార్యనిర్వాహ ఎర్ర నర్సింగ్ అన్నారు. ఆర్ఎస్ఎస్ వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా కొండమల్లేపల్లిలో ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు కవాతు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నారెడ్డి రవీందర్‌రెడ్డి, ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై పోరాడే సీపీఎం అభ్యర్థులను గెలిపించాలి

● పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు లక్ష్మీనారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు లక్ష్మీనారాయణ

పెద్దవూర, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడే సీపీఎం అభ్యర్థులను గెలిపించాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు చినపాక లక్ష్మీనారాయణ అన్నారు. మండలకేంద్రంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా సమస్యలపై నిరంతరం ప్రజల తరుపున పోరాడుతున్న సీపీఎం అభ్యర్థులను స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిపించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. పాలక వర్గాలు డబ్బు సంచులతో, మందు బాటిళ్లతో, కులం, మతం పేరుతో రాజకీయాలు చేస్తూ ఓట్లు దండుకొని ప్రజా సమస్యలను గాలికి వదిలేస్తున్నారని విమర్శించారు. అలాంటి రాజకీయ పార్టీలకు ఓట్లు వేయకుండా తిరస్కరించాలని అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మతాన్ని అడ్డు పెట్టుకొని ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొడుతోందని విమర్శించారు. మతం మైకంలో ప్రజల నుంచి దేశ సంపదను బడా కార్పొరేట్లకు దోచి పెడుతుందని, రాష్ట్రంలో బీజేపీని తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని, వెంటనే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి దుబ్బ రామచంద్రయ్య, మండల నాయకులు దోరెపల్లి మల్లయ్య, ఎస్కే.బషీర్, దుబ్బ ఏడుకొండలు, మగ్దుం మోహిద్దిన్, దేశ్యానాయక్, డి.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దుర్గాదేవీ శోభాయాత్ర



చింతపల్లి: వీ.టి.నగర్‌లో దుర్గామాత వద్ద పూజలు చేస్తున్న కమిటీ సభ్యులు

చింతపల్లి, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): చింతపల్లి మండలంలోని వెంకటేశ్వరనగర్ శివాలయంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవీ శోభాయాత్ర ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ శోభాయాత్రలో మహిళలు కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పూరె లక్ష్మణ్, మాజీ ఎంపీపీ కొండూరి భవానీపవన్‌కుమార్, నాయకులు అంగిరేకుల గోపాల్, మాన భాస్కర్, కాశగోని వెంకటయ్య, బాణాల దయాకర్, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి

చింతపల్లి, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): ఆలయ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని తక్కళ్లపల్లి మాజీ సర్పంచ్ ముద్దం సత్తమ్మ మారయ్యగౌడ్ తెలిపారు. చింతపల్లి మండలంలోని తక్కళ్లపల్లి గ్రామంలో ఆదివారం ముత్యాలమ్మ దేవాలయానికి తన వంతుగా రూ.6 లక్షలు విరాళం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలోని ప్రతి ఒక్కరూ ఆలయాల అభివృద్ధికి సహకరించాలన్నారు. గ్రామంలో భక్తిభావాన్ని పెంపొందించడానికి తమవంతు సహకారం ఎల్లప్పుడు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జై భవానీ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు ముద్దం రవీందర్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు పొగాకు శ్రీశైలం, మాజీ ఉపసర్పంచ్ మేతరి శోభారాణి యేసు, తదితరులు పాల్గొన్నారు.